# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ : (0863) 2293280, 2293564, 2293206

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకటరత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి

మిస్.పి. ఇందిరాదేవి

జి.ఎస్.ఆర్. మూర్తి

డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు

డా॥ యమ్.స్వర్ణముఖి



Volume 29 Issue 9

No.of Pages 40

MAY 2010

| | | |
|---|---|---|
| 5సం॥లచందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్స్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్స్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థసద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,


### ఈ సంచికలో....


| | పేజీ |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 4 |
| సంపాదకీయం | 5 |
| బాబూజీ ఉవాచ | 6 |
| మాతాజీఅభిభాషణ | 9 |
| సన్నిధిలోసంభాషణ | 12 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 15 |
| సత్సంగసౌరభం | 16 |
| సంత్‌నామదేవ్ చరితామృతం | 18 |
| శ్రీకృష్ణతత్వము ప్రేమయోగము | 20 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 22 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 24 |
| మాతాజీ బోధామృతం | 27 |
| మాతాజీ సత్సంగ్ డైరీ | 29 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 32 |
| సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర | 34 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 37 |
| శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాదబాబు ఆవాస గురుకులం (ఎడ్మిషన్స్ వివరాలు) | 40 |

# భద్రవాక్యం

**శ్లో॥ జీవం తతం జాగ్రతీహ స్వజనమథ మృతం స్వప్నకాలే నిరీక్ష్య**
**నిర్వేదం యాత్యకస్మాన్మృత మమృతమమువేక్ష్య హర్షం ప్రయాతి**
**స్మృత్వాప్యేz తస్యజంతోర్నిధన మనుయుతిం భాషతే తేనసాకం**
**సత్యేవంభాతి భూయోzల్పక సమయవశాత్సత్యతా వామృషాత్వమ్॥**

-శతశ్లోకి - 35

శాస్త్రికి తన అత్యంత ప్రియమిత్రుడు సిద్ధాంతి తన దగ్గరకే వస్తూ ఉండటం కనిపించింది. శాస్త్రికి కొంచెం అనుమానం కలిగింది. ఈ మధ్యనే సిద్ధాంతి పోయాడని విన్నాడు తను. అయినా మనిషి స్పష్టంగా ఎదురుగా కనిపిస్తూ ఉంటే ఈ వెధవ అనుమానాలేమిటి? అనుకున్నాడు. సిద్ధాంతిని సంతోషంగా పలకరించి కుశల ప్రశ్నలు వేశాడు. సిద్ధాంతి సమాధానం చెప్పకుండా తనను చెయ్యి పట్టుకొని ఎక్కడికో లాక్కొని పోతున్నాడు. ఎక్కడికో ఏమిటో తనకు ఏమీ అంతుపట్టటం లేదు. అంతలో దారిలో రోడ్డుమీద ఒక పెద్ద గుంపు కనిపించింది. అందరూ ఏదో మాట్లాడుకుంటూ అటూఇటూ హడావుడిగా తిరుగుతున్నారు. సిద్ధాంతి అందర్నీ తోసుకుంటూ, బలవంతంగా ఆ గుంపుమధ్యలోకి తీసుకెళ్ళాడు. ఏదో అశుభాన్ని శంకిస్తూ, కడుపులో దేవినట్లు అయింది. ఏదో చెప్పలేని భయంతో గుండె అతి వేగంగా కొట్టుకుంటున్నది. సిద్ధాంతి ఆగి ఏదో చూపిస్తున్నాడు. అక్కడ రక్తం మడుగులో ఒక శవం పడి ఉన్నది. ఆ దృశ్యం చూడగానె శాస్త్రికి పైప్రాణాలు పైననే పోయాయి. అంతే 'బాబూ!' అని పెద్దగా అరుస్తూ విరుచుకొని పడిపోయాడు. అక్కడ శాస్త్రికి కనిపించింది, తన ఒక్కగానొక్క కుమారుడు, సోమయాజి శవం. సోమయాజి ప్రయాణించిన స్కూటర్ ప్రక్కనే పడి ఉంది. మూర్ఛ పోయిన శాస్త్రికి తనను ఎవరో కుదుపుతున్నట్లు అనిపించింది.

'ఏమిటండీ అంత పెద్ద గావుకేక పెట్టారు. ప్రొద్దెక్కింది లేవండి. మీరు త్వరగా కాలకృత్యాలు ముగించుకుంటే కాఫీ ఇస్తాను' అంటూ శాస్త్రి భార్య ఆయనను కుదిపి నిద్ర లేపుతున్నది. శాస్త్రి కళ్ళు తెరిచి చుట్టూ అయోమయంగా చూశాడు. తన ఇంట్లోనే తన మంచంమీదనే తను ఉన్నాడు. ఆ రోడ్డు, గుంపు, సిద్ధాంతి, రక్తపుమడుగులో పడిఉన్న తన కుమారుడి శవం ఏమీ లేవు. అయితే ఇదంతా కలా! ఎంత భయంకరమైన కల. శరీరంలో వణుకు ఇంకా

తగ్గలేదు.ఇంకా తనలో ఎక్కడో అదంతా నిజమేనేమో అని అనిపిస్తున్నది. మెల్లగా లేచి కాలకృత్యాలు తీర్చుకొని స్నానం చేసి వచ్చి భార్య ఇచ్చిన కాఫీ త్రాగుతూ కూర్చున్నాడు. ఇంతలో సోమయాజి వచ్చాడు. తనను ఎగాదిగా చూస్తున్న తండ్రివైపు చూస్తూ ఏమిటి నాన్నగారూ అంత పరీక్షగా చూస్తున్నారు. ఇవ్వాళ నాకు ప్రమోషన్ ఇంటర్వ్యూ ఉందన్న సంగతి మరచి పోయారా! నన్ను దీవించండి అటూ నమస్కరించాడు. శాస్త్రి గురుకటాక్ష సిద్ధిరస్తు, విజయీభవ అని దీవిస్తూ, గురుదేవులను స్మరించుకొని, ఇంటర్వ్యూలో చక్కగా సమాధానాలు చెప్పు, అంతా శుభం అవుతుంది అన్నాడు. మళ్ళీ తన ఆలోచనలలో తనే. చచ్చిపోయిన సిద్ధాంతి ఎలా బ్రతికి వచ్చి కలలో కనిపించాడు? ఇందాక కలలో చచ్చినపోయిన కొడుకు ఇప్పుడు ఎలా బ్రతికి వచ్చాడు?

శంకర భగవత్పాదాచార్యులవారు శతశ్లోకిలో జగత్తు మిథ్య అని నిరూపించటానికి స్వప్న దృష్టాంతాన్ని చూపిస్తూ ఈ పై శ్లోకాన్ని ఉదాహరించారు. తను జాగ్రదవస్థలో ఉన్నప్పుడు బ్రతికి ఉన్నట్లు చూసినవారిని, స్వప్నావస్థలో చనిపోయినట్లు చూస్తే ఎంతో దుఃఖాన్ని పొందుతాడు. అలాగే ఎప్పుడో చనిపోయిన ఏ తాతగారో స్వప్నావస్థలో సజీవంగా వచ్చి మాట్లాడుతుంటే, ఆ స్వప్నావస్థలో ఎంతో సంతోషాన్ని అనుభవిస్తాడు. తనకు స్వప్నంలో ఒకడు చనిపోయినట్లు అనుభవం కలిగినా, తరువాత జాగ్రదవస్థలో అతడు జీవించి ఉన్నట్లు అనుభవం అయితే అతడితో మామూలుగా మాట్లాడతాడు.

జాగ్రదవస్థలో కానీ స్వప్నావస్థలో కాని రెండింటిలో, వస్తువు వలన కలిగే అనుభవం సమానమే. అదెంత అబద్ధమో ఇదీ అంతే అబద్ధం. లేదా అదెంత నిజమో ఇదీ అంతే నిజం. అయితే అనుభవకాలం అత్యంత స్వల్పంగా ఉండటం వలన, స్వప్నమూ, స్వప్నములో వస్తువులు మిథ్య అనీ, అనుభవకాలం చాల ఎక్కువగా ఉండటం వలన జాగ్రదవస్థ, అందులోని వస్తువులు సత్యం అని లోకంలో వ్యవహార ప్రతీతి కలిగింది. కాని దీర్ఘంగా ఆలోచించి చూస్తే, వాస్తవానికి ఆ రెండవస్థలలో అనుభవమైన దృశ్యములు భ్రమవలన కలిగినవే, ఈ రెండింటిలో ఎందులోను సత్యంలేదు. దీనినే ఆచార్యులవారు పై శ్లోకం ద్వారా నిర్ద్వంద్వంగా చెప్తున్నారు. *

# అమ్మ ఆశీస్సులు

**దినయామిన్యౌ సాయం ప్రాతః శిశిర వసన్తౌ పునరాయాతః ।**
**కాల క్రీడతి గచ్ఛత్యాయుః తదపి న ముంచత్యాశావాయుః ॥**

"పగలు రాత్రులు, ఉదయాస్తమయాలు వస్తూఉంటాయి, పోతూ ఉంటాయి. అలాగే ఋతువులు కూడా మారుతూఉంటాయి. ఒక్కొక్క రోజూ గడిచేకొద్దీ నీ ఆయువు తరిగిపోతోంది. మృత్యువు చేరువలోనే ఉన్నా మనిషిలో ఆశ అనేది చావదు. ఎడతెరిపిలేని కోరికలతో నీ కాలాన్ని వ్యర్థం చేసికోకు. గోవిందుని భజించు" అని శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారు భజగోవిందం అనే గ్రంథంలో చెప్పారు. వారు సాక్షాత్ శ్రీ శంకరుల అవతారము, కేరళ రాష్ట్రంలో, కాలడి అనే గ్రామంలో శివగురు, ఆర్యాంబ దంపతులకు శివుని వర ప్రసాదంతో శివుని అంశతో జన్మించారు శ్రీ శంకర భగవత్పాదులు.ఎనిమిదవ ఏటనే వేదాధ్యయనం చేశారు. పన్నెండవ ఏట సర్వ శాస్త్రాలను మథించారు. ఆసేతు హిమాచలం పర్యటించి అద్వైత తత్వాన్ని ప్రబోధించి నాస్తిక వాదాన్ని తరిమికొట్టారు. శ్రీ ఆది శంకర భగవత్పా దాచార్యులవారి జయంతి ఈ నెల 18వ తేదీన వస్తోంది. ఆ పవిత్రమైన రోజునే అపర శంకర స్వరూపంతో బృందావనంలో ఆరాధ్యదైవంగా విరాజమానమైఉన్న శ్రీ గురుదేవుల పంచదశ వార్షిక మూర్తి ప్రతిష్టా మహోత్సవాన్ని మనం జరుపుకోబోతున్నాం. వారి దివ్య సన్నిధిలో మనం అన్ని కార్యక్రమాలను జరుపుకుని ఆనందం పొందే అపూర్వ అవకాశాన్ని శ్రీవారు మనకు ప్రసాదించారు. ది. 27న వైశాఖ గురు పూర్ణిమనాడు భక్తులందరము కలిసి శ్రీ గురుదేవులను పూజించుకొని వారి ఆశీస్సులను బడయనున్నాము.

వసంతఋతు ఆగమనంతో వేసవికాలం వచ్చేసింది. లేత మామిడి చిగుళ్ళను మేసి కోయిలలు వసంత రాగాలను ఆలాపిస్తున్నాయి. మామిడి చెట్లకు మామిడి కాయలు గుత్తులుగా వేళ్ళాడుతున్నాయి. శ్రీ గురుదేవులు ఏమనేవారో తెలుసా? "వేడి అన్నంలో కొత్తావకాయ కలుపుకొని, అందులో ఆవునెయ్యి వేసుకొని ఒక్కొక్క ముద్ద నోటికి అందిస్తూఉంటే భార్యాబిడ్డలు గుర్తుకు వస్తారా? అతిగా దేనిని తిన్నా అది చేసే పని అది చేస్తుంది. ఇంట్లో వాళ్ళు ఘొల్లుమంటారు. డాక్టర్ల జేబులు ఘల్లుమంటాయి" అనేవారు. "మామిడికాయ పచ్చిగా ఉన్నప్పుడు అది చెట్టును గట్టిగా పట్టుకొని ఉండి గట్టిగా లాగినా ఊడిరాదు. దానిలో పచ్చదనము, పులుపు ఉంటాయి. దానిని చెట్టునే ఉంచితే దానిలో పులుపు విరిగి మధురమైన రుచి గల మామిడిపండుగా మారుతుంది. దాని రంగు బంగారుగా మారుతుంది. అది తనంతట తానే రాలిపోతుంది. మానసిక వైరాగ్యం లేనివాడు పచ్చి మామిడికాయ వంటివాడు. అతనిలోఅహంకారమనే పులుపు విరిగి, మమకారమనే పచ్చిదనంపోయి వైరాగ్యంతో పక్వస్థితికి వచ్చినప్పుడు అతడే పరమహంస స్వరూపుడుగా ప్రకాశిస్తాడు. అట్టి పరమహంస స్వరూపులైన శ్రీ గురుదేవులు మనందరకూ అట్టి భక్తి వైరాగ్య సంపదను ప్రసాదించెదరుగాక! సుఖీభవ! సుఖీభవ!!

- మీ అమ్మ

# సంపాదకీయం

శ్రీ శంకర భగవత్పాదులు జగన్మిథ్యాత్వాన్ని నిరూపించటానికి ఇచ్చిన స్వప్న దృష్టాంతాన్ని ఈ సంచికలో ప్రచురించాము. జాగ్రదవస్థలో ఉన్నప్పుడు మనం ఆ అవస్థలో అనుభవానికి వస్తున్నవన్నీ నిజం అని, స్వప్నంలో చూసిన దృశ్యాలు జాగ్రదవస్థలోకి రాగానే కనపడకుండాపోవటం వలన, స్వప్నంలో కొన్ని సంవత్సరాలు గడచిన అనుభవం కలిగినా నిద్ర లేవగానే పట్టుమని పది నిముషాలైనా గడవలేదని తెలుస్తున్నందువలన, కలలో ఎవరినైనా హత్య చేస్తే జాగ్రదవస్థలో దానికి శిక్ష పడనందువలన, జాగ్రత్తులో అసాధ్యము, అసంభవము అయినవి స్వప్నావస్థలో సుసాధ్యం, సంభవం అయినట్లు అనుభవం కలగటం వలన స్వప్నంలోని అనుభూతులను మిథ్య అంటాము.

కాని కొంచెం లోతుగా ఆలోచించి చూస్తే, స్వప్నంలో జాగ్రత్తులోనివి కనపడటంలేదు కదా! మనం స్వప్నావస్థలోని కాలాన్ని జాగ్రదవస్థలోని కాలమానంతో కొలవకూడదు. దేని కాలమానం దానిదే. నీకు స్వప్నంలో 40 సంవత్సరాల కాలం గడిచినట్లనిపిస్తే, ఆ స్వప్నంలోని పాత్రధారులందరికీ కూడా 40 సంవత్సరాలు జరిగినట్లే అనిపిస్తుంది. నీ జాగ్రదవస్థలోని పాత్ర ధారులు ఆ అవస్థలో కొన్ని జరగటం అసంభవం, అసాధ్యం అని నిజంగా ఎలా విశ్వసిస్తారో, అలాగే నీ స్వప్నంలోని పాత్రధారులు ఆ స్వప్నంలో జరుగుతున్న వాటిని (అవి జాగ్రదవస్థలో జరగటానికి అసంభవమైనవిఅయినా సరే) నిజంగా జరుగుతున్నట్లే విశ్వసిస్తారు. నీవు జాగ్రదవస్థలో చేసిన మంచి చెడుల ఫలితాన్ని జాగ్రదవస్థలోనే ఎలా అనుభవిస్తావో, అలాగే స్వప్నావస్థలో చేసే మంచి చెడుల ఫలితాన్ని ఆ స్వప్నంలోనే అనుభవిస్తావు. మరి స్వప్నావస్థవలె జాగ్రదవస్థకూడ మిథ్య అయితే, జాగ్రదవస్థలో నీకు దర్శనమిచ్చే నీ గురుదేవుడు, ఆయన బోధ అంతా మిథ్యేనా? అన్న సందేహం తప్పక కలుగుతుంది. గురుతత్త్వం ఒక్కటే సత్యం. దానికి ఏ రూపం, నామం లేకపోయినా, దేహానికి అలవాటు పడ్డ మనకోసం ఒక దేహాన్ని, నామాన్ని ధరించినట్టు కనిపిస్తుంది. అంతే కాని వాస్తవానికి దానికి ఒక రూపంలేదు. అందువలననే ఆ రూపం, నామం మిథ్య. మిథ్య అయిన స్వప్నంలోని మిథ్యాదాహం ఆ స్వప్నంలోని మిథ్యా పాత్రధారి ఇచ్చే మిథ్యా జలంతోనే తీరినట్లు, మిథ్య అయిన జాగ్రదవస్థలో మిథ్య అయిన నీ అజ్ఞానం నశించాలి అంటే ఆ జాగ్రదవస్థలోనే మిథ్యారూపాన్ని ధరించిన గురుదేవుడు అందించే మిథ్యా జ్ఞానాన్ని గ్రోలటం ఒక్కటే మార్గం. అప్పుడే నీవు జాగ్రదవస్థలోనుండి, తురీయావస్థలో మేల్కొని, జాగ్రదవస్థకూడా ఒక దీర్ఘ స్వప్నావస్థ అన్న ఎరుక కలిగి ఆత్మ సాక్షాత్కారానుభూతిని పొందుతావు.నీ స్వప్నావస్థలోని పాత్రలను ఎవరు సృష్టించారు? కలకరిగిపోగానే అవి ఎక్కడ లేదా అవి ఎవరిలో లీనం అవుతున్నై? నీవే. నీలోనే. అలాగే జాగ్రదవస్థలోని పాత్రలుకూడా. అందుకే మహాత్ములు చెవిలో ఇల్లు కట్టుకుని పోరుతున్నారు. స్వప్నం ఎంత మిథ్య లేదా సత్యమో జాగ్రదవస్థకూడా అంతే మిథ్య లేదా అంతే సత్యం అని రెండూ భ్రాంతి జన్యాలు మాత్రమే అని.

శ్రీ సద్గురుదేవులు అట్టి సత్యజ్ఞానాన్ని, స్వస్వరూపానుభూతిని మనందరకు ప్రసాదించెదరు గాక!

- గౌ. సంపాదకుడు

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

మరి కామక్రోధాది అరిషడ్వర్గాలను జయించే శక్తి, బలము దేని వల్ల వస్తాయి? ఆ శక్తిని, బలాన్ని ఇచ్చే పదార్థం ఒకటి ఉంది. దానికి డబ్బు ఖర్చు అవసరం లేదు. అది డబ్బుతో కొనేది కాదు. అది బ్రహ్మ పదార్థము. అదే కృష్ణనామము. అదే భగవన్నామము. "ఓం వాసుదేవాయ నమః'' అనే దివ్య నామము. ఆ వాసుదేవుని పాదద్వయము నందు మనస్సును ఉంచితే, ద్వైతబుద్ధి హరిస్తుంది. ఆ పరబ్రహ్మ స్వరూపము జాతి, నామ, కుల గోత్రాలు, దేశ, కాలభేదాలు, గుణాలు దోషాలు లేనిది. అవి నీలో నుంచి కూడా తీసివేసుకో గలిగితే నీవూ పరమాత్మకు దగ్గర అవుతావు. ఈ బ్రహ్మ పదార్థమును, ఈ దివ్యనామాన్ని సేవిస్తే కామక్రోధాది శత్రువుల పీడ వదిలి పోవటమే కాక, నానా జన్మల కర్మ బీజాలు, వాసనలు అన్నీ హరించిపోతాయి.



సముద్రంలో కెరటాలు అంతు లేకుండా ఎలా ఉత్పన్నమవుతాయో మానవుని మనస్సులో సంకల్పాలు కూడా అలాగే ఎడ తెరిపి లేకుండా ఉత్పన్నం అవుతూనే ఉంటాయి. అది మనస్సు లక్షణం. మనస్సుకు minister చిత్తము. బుద్ధికి minister అహంకారము. ఈ నాలుగిటిలోను మనస్సు నాయకుడు. దానిని తీసికొని వెళ్ళి భగవానుని దివ్య పాదారవిందముల యందు నిలపాలి. ఆ దివ్య నామాన్ని నిరంతరము జపించాలి.

ఎన్నో నీచ యోనులలో జన్మించి, ఎన్నెన్నో పాపకర్మలు చేసి మానవుడు ఆర్జించిన పాతకములు, మనస్సులో పేరుకు పోయిన వాసనలు వదలటం చాలా కష్టము. ఇడ్లీ, సాంబారు తిన్న తర్వాత, ఆ సాంబారు వాసనే ఒక పట్టాన చేతి నుంచి వదలదు. ఇక జన్మ జన్మాంతర వాసనలు వదిలించికోవాలంటే ఎంత శ్రమ పడాలి? నిరంతరము ఆ భగవానుని దివ్యనామాన్ని తైలధారవలె జపిస్తే గాని ఆ వాసనలు వదలవు. ఇది ఎలా జరుగుతుంది? కొన్ని రోజులు నిలవ ఉన్న పేడ ఎంతో దుర్గంధంతోను,

పురుగులతోను కూడి ఉంటుంది. దానికి దగ్గరగా కూడా వెళ్ళలేము. అది ఎన్నో అంటు వ్యాధులకు కూడా కారణం అవుతుంది. కాని అటువంటి పేడను అగ్నిలో పడవేస్తే, దానిలోని మలినాలు, దుర్గంధము అన్నీ హరించి, అది పరిశుద్ధమైన విభూతిగా మారుతుంది. అది పరమశివుడికి కూడా అలంకార యోగ్యమవుతుంది

అలాగే మానవుడు తన గురుదేవుని వద్ద పొందిన లక్ష్యార్థమును భక్తి, శ్రద్ధలతో మనస్సున నిలిపి ధ్యానిస్తే, దాని వలన ధ్యానాగ్ని ఉత్పన్నమవుతుంది. మానవుని మనస్సులో ఎన్నో జన్మల నుండి పేరుకుపోయిన వాసనలు, కర్మబీజాలు అన్నీ ఆ ధ్యానాగ్నికి ఆహుతి అయిపోయి, పేడవలె మలినమై ఉన్న అశుద్ధ మనస్సు, విభూతివలె పవిత్రమై శుద్ధ మనస్సు అవుతుంది. అటువంటి శుద్ధ మనస్సు పరమాత్మునికి నివాస యోగ్యమవుతుంది. "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరీ మహా మంత్రాన్ని అలా జపించటం ద్వారా పంచ మహాపాతకములు, ఉపపాతకములు అన్నీ నశించి పోతాయని నారాయణోపనిషత్తు చెబుతున్నది.

ఈర్ష్య, అసూయ, ద్వేషము, అసహనము అనే నీచ గుణాలతో కూడి ఉన్నపుడు మానవుడు మంచిని ఆలోచించలేడు. మంచిని చూడలేడు. మంచి గ్రహించలేడు. మంచి పనులు చేయలేడు. అతనికి శాంతి, సుఖము కరువైపోతాయి. అటువంటి మనస్సు గొంగళి పురుగువలె చూడటానికి, దగ్గరకు చేరటానికి కూడా అసహ్యంగా ఉంటుంది. కాని భగవన్నామం నిర్విరామంగా జపించటం వలన ఆ మనస్సు సత్య స్వరూపాన్ని పొంది, ఎంతో సుందరంగా అందరి ప్రేమను చూరగొనేదిగా మారిపోతుంది.

ఇదెలా జరుగుతుంది? గొంగళి పురుగు చుట్టూ మట్టితో ఒక గూడును కట్టి, దానిని అందులో బంధించి, దాని చుట్టూ ఝుమ్మని ఓంకారం చేస్తూ భ్రమరం తిరుగుతూ ఉంటుంది. లోపల ఉన్న గొంగళి పురుగుకు తప్పించుకునే మార్గం లేక, భ్రమరం మీద భయభక్తులతో, అది చేసే ఓంకారాన్ని వింటూ యితర ధ్యాస లేకుండా ఉంటుంది. అలా ప్రణవ ధ్యానంలో లీనం కావటం వల్ల ఆ గొంగళిపురుగు తన అసహ్యకరమైన రూపాన్ని, గుణాన్ని కోల్పోయి అందమైన సీతాకోక చిలుకగా మారిపోతుంది. దాన్ని చూడటానికి దరి చేరటానికి అందరు ఎంతో ఇష్టపడతారు. అదే విధంగా ఎన్నో నీచ గుణాలతో వాసనలతో కూడిన మనస్సును ఇతర విషయాలలోనికి

పోనీయకుండా సాధన అనే గూటిలో బంధించి, శ్రీ గురుదేవుడనే భ్రమరం ప్రసాదించిన లక్ష్యార్థ మంత్రాన్ని నిర్విరామంగా జపిస్తే, ఆ లక్ష్యార్థమందు నిలిచిన కొలది మనస్సులోని మలినము, దుర్గుణాలు, వాసనలు హరించి అది పవిత్రము, శుద్ధము, నిర్మలము అయిన మనస్సుగా మారి ఆ లక్ష్యార్థ స్వరూపాన్నే, అంటే సత్య స్వరూపాన్నే పొందుతుంది.

అలా మనస్సు సత్య స్వరూపాన్ని పొందినపుడు, అన్నిటిలోను మంచినే చూసి, మంచినే ఆలోచించే శక్తి చిత్తానికి వస్తుంది. చిత్తం ఆ విధంగా శాంతి రూపాన్ని పొందుతుంది. బుద్ధికి అప్పుడు మంచి నిర్ణయాలు చేసే మేధస్సు వృద్ధి పొందుతుంది. సర్వత్ర మంచిని గ్రహించే బుద్ధికి అందరి ఎడ దయాగుణం వృద్ధి పొందుతుంది. అలా బుద్ధి దయగా మారిపోతుంది. ఇక అటువంటి మానవుడు అందరికి మంచినే చేయగలుగుతాడు. అందరిని ప్రేమించగలుగుతాడు. అందరి ప్రేమనూ చూరగొనగలుగుతాడు. ఆ విధంగా అతని క్రియాశీలమైన అహంకారం నిర్మలమైన ప్రేమగా, ప్రతిఫలాపేక్ష లేని ప్రేమగా మారిపోతుంది.

ఈ విధంగా భగవంతుడిచ్చిన అంతరింద్రియాలను, బాహ్యేంద్రియాలను కూడా మానవుడు సద్వినియోగం చేసుకుని వాటి ద్వారా సర్వ జీవరాసులకు ఉపకారం చేస్తూ, ప్రేమను వెదజల్లుతూ ఉంటే, ఇక అతనికి శాశ్వత సుఖశాంతులు లభించటంలో ఆశ్చర్యమేమున్నది? ఇహంలో అతనికి తరగని భోగభాగ్యాలు లభించటమే గాక, పరంలో కూడా మోక్ష సామ్రాజ్యం అతని సొమ్మే అవుతుంది.

ఇలా ఇతర చింతలు మాని, మానవుడు ఎప్పుడూ ధ్యానంలోనే ఉంటే, అతను నిర్వర్తించవలసిన ధర్మాలు ఎలా జరుగుతాయి? సంసారాలు ఎలా నడుస్తాయి? దారాపుత్రాదులను ఎలా పోషించగలుగుతాడు? అని కొందరు ప్రశ్నిస్తారు. ఇటువంటి ప్రశ్నలన్నీ, అటు ధ్యానమూ సరిగా చేయకుండా, ఇటు తన విధ్యుక్త ధర్మాలనూ సరిగా నిర్వహించకుండా సోమరితనంగా కూర్చున్న వాళ్ళు వేసే ప్రశ్నలే. ఎప్పుడూ ముక్కు మూసుకొని ధ్యానం చేసుకుంటూనే కూర్చోమని తన విధ్యుక్త ధర్మాలను నెరవేర్చవద్దని, దారాపుత్రుల సంక్షేమాన్ని చూసుకోవద్దని మన పవిత్ర గ్రంథాలూ చెప్పలేదు; మహాత్ములూ చెప్పలేదు. మెడపైన తలకాయ ఉన్న మానవుడు ఎవ్వడూ కూడా అలా చెప్పడు.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గతసంచిక తరువాయి) -జపమాల ప్రసాద

'మాతాజీ ఎవరబ్బా? ఏ జాతికి చెందినది? వారిది పూర్వాశ్రమంలో ఏవూరు? వారి తల్లిదండ్రులెవరు?' ఈ మాటలేవేనా మిమ్మల్ని తరింపచేస్తాయా? ఇదెక్కడి కర్మ! బయట ప్రపంచంలో తిరిగినదానికీను, ఆశ్రమాలలో వుంటున్నదానికీ తేడా ఏమిటి? మహాత్ములని ఆశ్రయించాక, వారిలో గుర్తించవలసినది ఏమిటి? వారిని ఈ విధంగానా మనం గుర్తించేది? కులము, జాతి అన్నీ త్యజించి, జాతి నీతి కులగోత్ర దూరగమైన బ్రహ్మవస్తువేదయితే వుందో, దానిని ఆర్జించుకుని, మన జీవితాలని పునీతం



చేసుకోవలసిన వాళ్ళం మనం. ఎక్కడికి వచ్చినా వాసనలు వదిలిపోవటంలేదు. వాసుదేవస్మరణని విడిచిపెట్టేసి, మాకు వాసనలే కావాలని అనుకుంటే, ఇక ఎక్కడండీ తరింపు? ఈ జీవితం మూడునాళ్ళ ముచ్చటేగా! దీనికేమైనా గ్యారంటీ వుందా? ఎంతమంది చెప్పకుండా పోవటంలేదు! తరువాత శ్వాస వుంటుందని గ్యారంటీ వుందా? బ్రతకాలని ఆశ ప్రతివారికీ వుంటుంది. అందరికీ శాశ్వత సుఖాన్ని పొందాలనే వుంటుంది. కానీ ఆశ వున్నంత మాత్రంచేత, అందరూ నూరేళ్ళు బ్రతికిపోతున్నారా? ఈ జీవితంలో దేనిని గుర్తించాలి? ఏ హృదయం అయితే శాశ్వతమైన వస్తువుని గుర్తిస్తుందో, అదే నిజమైన జీవితం. "అజ్ఞాని ఏ మెరుగు హరినామస్మరణ సుజ్ఞానులైన భాగవతులు తప్ప?"

మహాత్ములెంతెంతో సాధనలు చేసి, శాశ్వతమైన నిధిని మనకి ఒలకబోసి వెళ్ళారు. దానిని ఏరుకుని పదిలపరచుకొని, ఆచరించిననాడే వారందించిన నిధికి మనం నిజమైన వారసులమవుతాం. విన్నది విన్నట్టుగా మనం ఆచరించలేకపోతే మన జీవితం వ్యర్థం. కనీసం ఆచరించడానికి ప్రయత్నమేనా చేస్తే, భగవంతుడి నిధికి మనం వారసులమవుతాం. మన జీవితాన్ని సార్థకం చేసుకున్నవాళ్ళమవుతాం. అటువంటి దివ్య గురుపాదుకలు అఖండ భక్తి, జ్ఞానవైరాగ్యములని ప్రసాదించి మనలను కాపాడుగాక!

# 7.పేరు కాని మరో పేరు

(కాళహస్తి శుకబ్రహ్మాశ్రమ వ్యవస్థాపకులు బ్రహ్మీభూతులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి పంచమ పుణ్యారాధన సందర్భంగా, శుకబ్రహ్మాశ్రమము నందు ఏప్రియల్ 18, 19/2003 తేదీలలో జరిగిన సాధుధర్మ సమ్మేళనమందు శ్రీమాతాజీ వారి అనుగ్రహ భాషణం)

"ప్రియాత్మ బంధువులారా! ఈ దేహానికి ఒక పేరుందని గానీ, అసలు ఈ దేహముందని గానీ, పూర్తిగా మరచిపోయినటువంటి వారు మహాత్ములు. దేహాత్మ భావనని రహితం చేసికొని, అనేక జన్మల వాసనా పరంపరచేత మనకి వచ్చిన ఈ దేహాన్ని దివ్యమైన దేహంగా మలచుకోడానికి తగిన శిక్షణని, సాధనని ఈ మహానుభావులందరూ మనకి ప్రసాదిస్తున్నారు. అంటే, "నువ్వు దేహివి కానీ దేహానివి కాదుసుమా! నువ్వు కేవలం ఆత్మస్వరూపుడవు. కించిజ్ఞత్వమైన ఈ సృష్టికి సంబంధించినవాడివి కాదు" అనే దివ్య జ్ఞానాన్ని ప్రబోధం చేయడానికి ఈ మహాత్ములు మనకింతటి సాధనాసంపత్తిని అనుగ్రహిస్తున్నారు.

మహానుభావులందరూ మన చెవులలో ఇల్లు కట్టుకుని ఎంతగానో ప్రబోధం చేస్తున్నా కూడా, 'అయ్యో! మాయ! ఏం చేస్తాం?' అన్ని చిన్నగా తీసిపారేస్తున్నాం. మాయ అనే పదం కూడా మహాత్ములు చెబితేనే మనకి తెలిసింది. ఆ మాయలో మునిగిపోతున్నాంగానీ, తేలటం తెలియటంలేదు. యా= ఏది, మా= లేదో అది మాయ అని ఆ పదానికర్థం. అంటే, లేనిదానిని ఉన్నదానిగా భ్రాంతి చెందడం 'మాయ'. అంతా భ్రాంతే, కానీ భ్రాంతి అని తెలిసాక, మళ్ళీ అందులోకి వెళ్ళకూడదుగా!

అందుకనే మహాత్ములు, మన పూర్వపు నామధేయాన్ని మార్చి, మరొక పునీతమైన నామాన్ని మనకనుగ్రహిస్తారు. ప్రపంచంలో వుంటున్నందుకు, పిలవబడడానికి పేరేమీ లేకపోతే బాగుండదు కనుక, ఉన్నతమైన మరొక నామధేయాన్ని మనకిచ్చి, 'నువ్వా స్వరూపం సుమా!' అని భగవత్ స్వరూపులైన గురుదేవులు అనుగ్రహిస్తారు. గురుపాదం అంతగొప్పది.

శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వాములవారిని నేను చూడలేదు. కానీ, వారు రచించిన 'గీతామకరందం'తో కొంచెం పరిచయముంది. నేను ఎక్కువగా

చదువుకోలేదు. అసలు నేను పుస్తకాలు చదవలేను. ఒకవేళ చదివినా ఒకపేజీ, లేక ఒక్కొక్కసారి ఒక పేరా దాటి వెళ్ళను. ఎందుకోగాని, కాస్త చదివేసరికి మనసు అందులో లయించిపోతుంది. తీరా టైము తెలిసేసరికి, ఏ అనుష్ఠానం వేళో అయిపోతుంది. దానితో ఇక చదువు ముందుకి వెళ్ళదు.

అస్మత్ గురుదేవులు, నాచేత మొట్టమొదటిసారిగా ఉపన్యాసం ఒకానొక గీతాజయంతి రోజున ఇప్పించారు. అందులోని అంతరార్థం స్వామి వారికే తెలియాలి. మననెలా నడిపించుకోవాలో వారికి తెలుసు కానీ, మనకేమీ తెలియదు. తెలిసి వున్నదల్లా గురుపాదం ఒక్కటే. ముందు ఆ గురుపాదంలోని మకరందాన్ని మనం తత్త్వపూరితంగా జుర్రుకుంటే, 'తెలివి' అంటే ఏమిటో తెలుస్తుంది. ఆ స్వరూపాన్ని మనం పొంది, అనుభవించడం తప్ప, ఎక్కడకు వెళితే అక్కడ అది లయించిపోతుంది.

మనం ఒక చీకటింట్లోకి వెళ్ళామనుకోండి. చీకట్లో మనం ఏ పనీ చేయలేం. మనకి వస్తువులు కనబడి, మన పని మనం చేసుకోవాలంటే మనకి లైటు కావాలి. వెళ్ళగానే స్విచ్ వేసి, ఆ లైటు వెలుగుతో మన పనంతా చేసేసుకొని, లైటు ఆర్పివేసి తిరిగి వచ్చేస్తున్నాం. మన పనులన్నీ చేసుకోడానికి అక్కడ వెలుగు ఆధారం అయినది. లైటు వేసుకొని పనులు చేసుకున్నాం గాని, ఏ ఒక్కరమైనా ఆ లైటు వంక చూస్తామా? చూడనే చూడం! ఆ వెలుగులో మన పనులు చేసుకోవడమే గాని, మనకంత ఉపకరించిన ఆ లైటుకి 'థాంక్సు' చెప్తామా? (మామూలుగా యితరులెవరైనా మనకేదైనా సహాయం చేస్తే థాంక్సు (కృతజ్ఞతలు) చెబుతాం కదా! ఆ 'థాంక్స్' చెప్పకపోతే కొంతమందికి కోపం కూడా వస్తుంది. ఏ ఒక్కరైనా ఆ లైటు వంక చూస్తే కాస్సేపు చుట్టూ వున్న వస్తువులు కనిపించవుకదా! మనకింత సహాయం చేస్తున్న లైటు వంక చూస్తేనే కొంచెంసేపు మనకి జగత్తు కనిపించటం లేదు కదా, మరి యీ కాంతులన్నిటికీ ఆధారమైన, కోటి సూర్య సమ ప్రభా భాసమైన ఆత్మవస్తువును గుర్తించిన వారికి, దర్శించిన వారికి, ఆత్మానుభవాన్ని పొందినవారికి ఇక ప్రపంచమనేది వేరుగా కనిపిస్తుందా? ఆఖరుకి ఆ ఆశ్రమం వాళ్ళది, ఇది వీరిది అనే భావన కూడా రాదే! అలా భావిస్తే ఖండత్వం చోటు చేసుకున్నట్టే కదా! మనం ఆశ్రయించిన వస్తువు ఖండమా? అఖండమా?

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గతసంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

22-3-1985

ఈ రోజు రాత్రి శ్రీబాబు వస్తూనే ప్రసాదరావుగారిని ఉద్దేశించి మాట్లాడుతూ 'ప్రసాదరావుగారూ! వచ్చారా? అంతా క్షేమమేనా? భార్యా పుత్రాదులు క్షేమమేనా? ధ్యానము బాగా జరుగుతోందా? గురుపాద ధ్యానామృతాన్ని గ్రోలుతున్నారా? మనస్సుకి ధ్యానామృతం అందుతోందా?' అని ప్రశ్నించారు. ప్రసాదరావుగారు మాట్లాడుతూ అన్నిటికి సమాధానం అవును అని చెప్పారు. శ్రీబాబు మాట్లాడుతూ 'అలాగైతే సరే' అన్నారు. ప్రసాదరావుగారు ముందుగా తాను వ్రాసిన ఉత్తరాన్ని గురించిన ప్రస్తావన తీసికొచ్చారు. ఉత్తరంలో ధ్యానాన్ని గురించిన అనుభవాలు వ్రాశారు.

శ్రీబాబు మాట్లాడుతూ 'ధ్యానంలో దర్శించే దృశ్యాలన్నీ మనస్సు ఊహించినవేగా! ఆ దృశ్యాలు కనబడినంత వరకూ మనస్సు నిలబడినట్లా నిలబడనట్లా? కాబట్టి ధ్యానంలో ఏ రకమైన దృశ్యాలు కనబడకుండా ప్రశాంతంగా ఉండి తనను తాను మరచి జాగ్రదవస్థలో ఉండటమే మంచి స్థితి. గాఢ సుషుప్తిలో ఎలాగైతే మనస్సు మరిచి నిదురించి ఆనందిస్తావో అటువంటి ఆనందాన్ని జాగ్రదవస్థలో మనస్సును మరచి పొందాలి. క్లోరోఫారమ్ ఇచ్చిన వ్యక్తిలో ఇంద్రియాలతో సంబంధం లేకుండా ఎలా మనస్సు ఉంటుందో అటువంటి స్థితి జాగ్రదవస్థలో పొందాలి. శబ్ద, స్పర్శ, రూప రస గంధాలకు అతీతమైన స్థితి అది. అదే భావ సమాధి. మనస్సు అటువంటి ఆనంద స్థితిలో ఏ రకమైన భావము లేకుండా నిశ్చలంగా ఉంటుంది.

దానిపైన స్టెప్ ఇంకొకటి ఉంది. అది కూడా పొందవచ్చు. ఇంత వరకూ నేను కాంతిని దర్శిస్తున్నాను, ఆనందాన్ని పొందుతున్నాను అనే భావనలో నేను అనేవాడు మిగిలిపోయాడు. అలా కాకుండా ఆ ఆనందాబ్ధిలో మునిగిపోయి తన్ను తాను మరచిపోవాలి. మీకొక దృష్టాంతం చెబుతాను. ఒక గురువుగారు శిష్యుడిని ప్రశ్నించాడట నీ సాధన ఎంతవరకు వచ్చిందని. ఆ శిష్యుడు సమాధానం చెబుతూ గురువుగారూ మీరు చెప్పిన ఆనందం ఎంతవరకూ పొందానో తెలియటం లేదు. నేను ఏ స్థితిలో ఉన్నానో తెలియ జేస్తారా? అని ప్రశ్నించాడట. వెంటనే ఆ గురువుగారు మాట్లాడుతూ శిష్యా! ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే ఉంది. కాబట్టి సాధన తీవ్రతరం చేయి. ఆనందం త్వరలోనే పొందగల్గుతావు అన్నారట.

చూశారా! నేను ఆనందాన్ని ఎంత వరకు పొందగల్గాను అని ప్రశ్నించటంలోనే తెలుస్తోంది వాడు ఏ రకమైన ఆనందం పొందటం లేదని. పంచదార తిన్నవాడి ముఖం చూడగానే తెలిసిపోతుంది వాడు మధుర పదార్థం తింటున్నాడని. అలాగే వేపరసం గ్రోలినవాడి ముఖం చూసి వాడిని వేరే ప్రశ్నించాలా? దాని రుచి ఎలా ఉందని?' అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ 'సాధకుడు ముందుగా జిహ్వా చాపల్యాన్ని జయించాలి. తరువాత వాచాచాపల్యాన్ని జయించాలి. అంటే సాధ్యమైనంత వరకూ మౌనంగా ఉండటానికి ప్రయత్నించాలి. అలా కాకపోతే భగవంతుడి గురించి మాత్రమే మాట్లాడటం, అనవసరమైన విషయాల గురించి ప్రసంగించక పోవటం మంచిది. దీని ద్వారా శబ్దము శుద్ధి చెందుతుంది. శబ్దము ద్వారా ఆకాశము దాని ద్వారా వాయువు శుద్ధి చెందుతాయి. మితాహారము చేయటం వలన ధ్యానము బాగా చేయగలుగుతావు.

ధ్యానం అంటే ఒక ఉదంతం జ్ఞాపకము వచ్చింది. ఒకసారి నేను, చిరంజీవిరాజు, శేషగిరిరావు ఇంకా కొంతమంది కలిసి పడవలో కొల్లేరులో ప్రయాణం చేస్తున్నాము. కొల్లేరు మధ్యలో ఉండగా పెద్దగాలి వచ్చి అకస్మాత్తుగా నీటిమట్టం పెరిగిపోయింది. మేమంతా ప్రమాదంలో చిక్కుకున్నాము. పడవ మునిగిపోయే పరిస్థితి వచ్చింది. అంతా ఏడుపులు మొదలు పెట్టారు. పడవలో పరిమి సుబ్రహ్మణ్యంగారు కూడా ఉన్నారు. వారందరినీ చూసి నాకు నవ్వు వచ్చింది. వీళ్ళందరికీ చావు అంటే ఎంత భయమో చూశారా! వారికి వెంటనే చెప్పాను. మీరెవరూ భయపడవలసిన పనిలేదు. మీ మీ స్థానాలలో కూర్చుని నా మీద విశ్వాసం ఉంచి కదలకుండా భగవంతుని ధ్యానించండి అన్నాను. వారంతా అలాగే కళ్ళు మూసికొని ధ్యానించారు. కొద్ది క్షణాల్లో పడవ ఒడ్డుకు చేరింది. పడవ ఎంత టైమ్‌లో ఎలా ఒడ్డుకు చేరిందో ఎవరికీ తెలియదు. వారి ధ్యాన ఫలితం చూశారా! అదీ ధ్యానం అంటే' అన్నారు శ్రీబాబు.

**23-3-1985**

ఈ రోజు రాత్రి శ్రీబాబు వాకింగ్ చేస్తూ ఉండగా తారకంగారు ఇంగ్లీషులో సంభాషణ చేశారు. శ్రీబాబు మాట్లాడుతూ 'తనకు ఏమీ తెలియదన్న విషయం తెలియకపోవటం అజ్ఞానమే కదా! అటువంటి అజ్ఞానమనే చీకటిలో ఉన్నవాడు నల్లటి వాడిని వెతుక్కోవటం కష్టం. నల్లని గోపాలుని దర్శనం కాంతిలోనే సాధ్యపడుతుంది. తనకి ఏమీ తెలియదన్న విషయం తెలుసు కాని తెలిసినట్లు నటిస్తాడు. వాడు కపట భక్తుడు. వంగి వంగి సలాములు చేస్తాడు. తామరాకు మీద నీటి బిందువు ఎలా ముత్యము వలె ప్రకాశిస్తుందో అలా భక్తుడివలె

నటిస్తాడు. అటువంటి కపట భక్తి పరీక్షకి నిలబడాలి కదా! నిజమైన బంగారం అయితే బంగారం పరీక్షకి నిలబడుతుంది గాని చిలకలపూడి బంగారం నిలబడుతుందా?'

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ 'అన్నీ తెలిసినవాడు తనకు ఏమీ తెలియనట్లు ఉంటాడు. అతడే మహాత్ముడు. అట్టి మహాత్ముని ఆశ్రయించాలి. ఆయన ప్రసాదించిన లక్ష్యార్థం మీద మనస్సు నిలిపినప్పుడే గురుతత్వము బోధ పడుతుంది. మనస్సు నిలబడాలంటే మీరు చేయవలసినదల్లా ధ్యానం. మీ మనస్సు ఎప్పుడు చలించిందో అప్పుడు మీ ధ్యానం లోపించినట్లు గుర్తించాలి. ధ్యానము ఎప్పుడైతే లోపించిందో మీకు గురుతత్వానికి మధ్య తెర అడ్డం వస్తుంది. అది మీలో గుణాన్ని ప్రేరేపిస్తుంది. అనేక రకాల మిమ్మల్ని హింసిస్తుంది. అది కేవలం మీ విశ్వాసంలో లోపమే గాని గురుతత్వములోగాని, గురు కృపలోగాని లోపమా! గురుకాంతికి మచ్చ లేదు. చంద్రునికి శుక్లపక్షం, కృష్ణపక్షం అనే తేడా ఉంది. సూర్యునికి రాత్రి పగలు అనే తేడా ఉంది. కాని గురుప్రేమ మధురమైనది. అది మీకు ఆనందాన్ని అందివ్వటమే కాక నీవు ఆనంద స్వరూపుడవు అని తెలియజేస్తుంది' అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ 'మీరు సాధన జాగ్రత్తగా చేసికోవాలి. మీలో మాయాశక్తి బలపడి మిమ్మల్ని పడవేస్తుంది. అప్పుడు పరిస్థితి మించిపోతుంది. నీ ఆర్తనాదం గురుదేవునికి అందనంత దూరంలో నిన్ను పడవేస్తుంది మాయాశక్తి. కాబట్టి పరిస్థితి మించిపోవకముందే జాగ్రత్త పడాలి సుమా!' అన్నారు.

ఈలోగా చిరంజీవిగారు మాట్లాడుతూ "భగవానుడు మన ప్రభువు కదా! ఆయనని అతిథి అని ఇందిరగారు కూడా ప్రయోగం చేశారు. అది ఎలాగండీ?" అని అడిగారు.

శ్రీబాబు మాట్లాడుతూ 'మన ఇంటికి వచ్చిన అతిథిని మనం ఎంతో గౌరవిస్తాము. అలాగే మన హృదయ మందిరాన్ని అలంకరించిన భగవానుని అలాగే గౌరవించాలి అనే భావంతో ఆ ప్రయోగం చేశారు. నాకు తెలిసినంత వరకూ ఆ పదంలో తప్పు కనబడలేదు. మీరంతా చదువుకున్నవారు మీరే నిర్ణయించాలి. మన పండితులు ఉన్నారు కదా, వారినే అడుగుదాం. ఏమండీ ప్రసాదరావుగారూ! అతిథి అంటే అర్థం ఏమిటండీ?' అన్నారు. తిథి అంటే పితృదేవతలని ఆరాధించే దినం. అతిథి అంటే కాలంతో పనిలేకుండా అన్ని వేళలా గౌరవించబడేవాడు అన్నారు. శ్రీబాబు 'మొత్తానికి పండితులు అనిపించుకున్నారు. చిరంజీవికి మాత్రం అతిథి అంటే అర్థం తెలియదన్నమాట' అన్నారు.

-సశేషం

# శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

## మే 2010

| | | |
|---|---|---|
| 8 | శని | శ్రీగురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ. |
| 12 | బుధ | మాస శివరాత్రి. |
| 18 | మంగ | ఆది శంకరాచార్య జయంతి, శ్రీ సద్గురు పంచదశ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవము, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన |
| 27 | గురు | (వైశాఖ) గురు పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన. |

## జూన్ 2010

| | | |
|---|---|---|
| 2 | బుధ | శ్రీ మహాకాళికా పరమేశ్వరీ సహిత రామలింగేశ్వరస్వామి ప్రతిష్ఠా ఏకోనత్రింశత్ వార్షిక మహోత్సవము, రాత్రి 7గం॥లకు శ్రీ మహాకాళికా పరమేశ్వరీ రామలింగేశ్వర స్వామి వారి లీలా కళ్యాణ మహోత్సవము. |
| 7 | సోమ | శ్రీ గురుదశమి, హనుమజ్జయంతి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. |
| 11 | శుక్ర | మాస శివరాత్రి |
| 20 | ఆది | శ్రీ సుగుణప్రసాద మాతాజీవారి తృతీయవార్షిక పుణ్యారాధన, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం. |
| 26 | శని | పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ. |

# సత్సంగ సౌరభం

-శివ ప్రసాద్

నీకు జ్ఞాన భిక్ష పెట్టాలంటే నీ హృదయం అనే చిప్పలో కామ, క్రోధ విషయ వాసనలు అనే చెత్తంతా తీసివేసుకోవాలి కదా? అన్నారు.

లోపల కామం ఉంటే లాభంలేదు. ఇల్లు అద్దెకు ఇవ్వాలి అంటే ముందు ఖాళీ చెయ్యాలి. రాముణ్ణి ఉపాసన చేసి లోపల కాళీ చేసుకున్నవారు కాళీ స్వరూపులౌతారు. స్వామివారు బస్ డ్రైవర్. రాధకు 'శ్రీకృష్ణుడు పిల్లన గ్రోవిని ఎప్పుడూ వదలిపెట్టడు కదా, ఎందువలన? ఆ పిల్లన గ్రోవిలో ఏమి ఉంది?' అన్న అనుమానం వచ్చింది. పిల్లన గ్రోవిలో ఏమీలేదు. అంతా ఖాళీ, ఏమీ లేదు కనుకనే దానిని కృష్ణుడు అలా పట్టుకున్నాడు. జ్ఞానం కావాలంటే లోపల ఉన్నవన్నీ తీసెయ్యాలి. మనోగత కామనలను అన్నింటినీ వదలెయ్యాలి.

శరీరం జడం. కామనలు దేహంలో లేవు. ఎలా తెలిసింది అంటే, స్వప్నంలో ఈ దేహం లేదు. కాని కోరికలు ఉన్నై. కనుక కోరికలు దేహానికి సంబంధించినవి కావు. ఆత్మ చైతన్యం. కోరికలు ఆత్మలో లేవు. ఎలా తెలుసు అంటే, గాఢ సుషుప్తిలో మనస్సు కూడ అజ్ఞానంలో లీనమై ఉంటుంది. ఇంద్రియాలు ఉండవు. కేవలం చైతన్యం మాత్రమే ఉంటుంది. గాఢసుషుప్తిలో కోరికలు ఉండవు. కనుక ఆత్మలో కోరికలు లేవు. అందువలన కోరికలు మనస్సులో ఉంటై. మనస్సు కోరికల పుట్ట. కోరికల సంపుటి. మనస్సు వస్త్రం వంటిది. అది నూలుయొక్క సంపుటి. వస్త్రంలో నుంచి పడుగు పేక అనే నూలును తీసివేస్తే, ఇక అక్కడ వస్త్రం అనేది ఏదీ ఉండదు. సాధన ద్వారా కాని విచారణ ద్వారా కాని, కోరికలు లేకుండా చేస్తే, మనస్సు లేకుండా పోతుంది.

సర్వాన్ కామాన్ అంటే చెడ్డ కోరికలతో పాటు మంచి కోరికలను కూడ, అన్నింటినీ తీసివేయ వలసిందే. ధర్మానికి సంబంధించిన కోరికలు మాత్రం నావి అన్నాడు భగవంతుడు.

భగవద్గీతలో మోక్షసన్యాస యోగంలో భగవానుడు **సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచ** అంటాడు. మంచి కోరికలు చెడ్డకోరికలు తీరే వరకే కావాలి. ఆ తరువాత వాటిని కూడ వదిలి వేయాలి. ముల్లును తీసే వరకే ముల్లుకావాలి. ఆ తరువాత ఆ ముల్లుతో పాటు ఈ ముల్లును కూడ పారేస్తాము. కట్టెలు మండుతుంటే, ఇంకొక కట్టె పట్టుకొని వాటిని లోపలికి తోస్తాము. చివరకు ఆ పట్టుకున్న కట్టెను కూడ మంటలో విసిరేస్తాము. అలా సర్వాన్ కామాన్ అన్ని కోరికలను పరిత్యజ్య,

వదిలేయాలి. జహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ అనలేదు. ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ అన్నాడు. అంటే మనస్సులో ఉన్న కోరికలను వాసనలతో సహా తీసేసుకోవాలి.

వంకాయవంటి కూర, శంక వంటి దయ్యం లేదు. ఇష్టమైనవి వదిలి పెట్టాలి. ఒకాయన కాశీకి వెళ్ళి వచ్చాడు. కాశీకి వెళ్ళినవాళ్ళు కాశీలో తమ కిష్టమైనది ఏదైనా వదిలి పెట్టాలి. ఏమండీ మీరు ఏమి వదిలేశారు అని అడిగితే వంకాయ వదిలేశాను అన్నాడట. అయ్యో! అదేమిటి, వంకాయ ఎంతో రుచిగా ఉంటుంది కదా. కూర చేసుకోవచ్చు, బజ్జీ చేసుకోవచ్చు, పప్పులో వేసుకోవచ్చు, సాంబారు చేసుకోవచ్చు, ఉల్లికారం పెట్టి కారపుకాయ చేసుకోవచ్చు. జీడిపప్పు మసాల వేసి వేపుడు చేసుకోవచ్చు. ఇంకా ఎన్నో రకాలుగా చేసుకోవచ్చు. దాన్నెందుకు వదిలారు అని అడిగితే, ఆయన నేను ఆయుర్వేదం మందు తీసుకుంటున్నాను, ఆ ఆయుర్వేదం డాక్టర్ వంకాయ తినగూడదన్నాడు. ఎలాగూ తినకూడదు కదా అని కాశీలో వదిలేశాను అన్నాడట. అలా వదలటం కాదు. ఇష్టమైనది వదిలి వేయాలి. ఒక్కసారి పూర్తిగా వదలలేకపోతే, ముందు కొంచెం తగ్గించుకోవాలి. జ్ఞానాన్ని పెంచుకోవాలి. క్రమంగా కోరికలను తగ్గించుకుంటూ చివరకు పూర్తిగా వదలివెట్టాలి. ప్రజహాతి అంటే సంపూర్ణంగా వదలటం. ఒకాయన కాశీ వెళ్ళి వచ్చాడు. ఏమి వదిలేశావు అంటే, కోపం వదిలేశాను అని చెప్పాడు. వింటున్నాయనకు ఆశ్చర్యం వేసి నిజంగానా? అని అడిగాడు. ఔను నిజంగానే వదిలేశాను అన్నాడు ఆయన. వింటున్నాయనకు ఇంకా తృప్తి కలగలేదు. నిజంగానా! నిజంగా కోపాన్ని వదిలేశావా? అని అడిగాడు. ఔనయ్యా, నిజంగానే, కోపాన్ని వదిలేశాను అన్నాడు ఆయన. నిజంగా మీరు కోపాన్ని వదిలేశారా? అని రెట్టించే సరికి ఆయన ఔనయ్యా! నీకుగాదూ ఇందాకటి బట్టి చెప్తున్నది. నిజంగానే వదిలేశానని ఎన్నిసార్లు చెప్పాలి నీకు అని అడిగినాయన మీద విరుచుకు పడ్డాడు. అలా వదిలేయటం కాదు. అలా వదిలితే, అంటే జహాతి, అంటే మళ్ళీ వస్తాయి. అందుకే ప్రజహాతి అని చెప్పారు. అంటే వాసనా రహితంగా కోరికలను వదలాలి.

ఆ వాసనలు మనలను ఒక పట్టాన పదలవు. ఆ వాసనలు మనస్సులో ఉన్నై. అవి పోవాలంటే, జ్ఞానం పెంచుకోవాలి. లోపల ఉన్న మనస్సును ఖాళీ చేసుకోవాలి. సర్వమూ ఖాళీ చేసుకొని, గురుదేవుడు సర్వమూ తానైనాడు. ఆ గురుదేవుణ్ణి ఉపాసించాలి. ఆయన పాదాలను ఆశ్రయించినప్పుడే తత్త్వం దొరుకుతుంది. ఆయనే స్థిత ప్రజ్ఞుడు. ఆయనను దర్శిస్తే, ఆయనను ఉపాసిస్తే ఆ స్వరూపం మనము అయిపోతాము. అందరూ స్థిత ప్రజ్ఞులు కావాలి. గత ప్రజ్ఞులు కాకూడదు.

-సశేషం

# సంత్ నామదేవ్ చరితామృతం

(గతసంచిక తరువాయి) -మనోజ్ కుమార్

ఒడలిపై వ్యాఘ్ర చర్మం. మెడలో రుద్రాక్షలు. చేతిలో త్రిశూలం. ఎడమ చేతిలో ఢమరుకం. శిరస్సుపైన కపర్దం. దానిపైనుండి క్రిందకు జాలువారుతున్న చల్లని గంగ... నరహరి 'వీళ్ళంతా తనని వెఱ్ఱివెంగళప్పను చేసి శివాలయానికి గాని తీసుకుని రాలేదు కదా? సందేహం లేదు ఇక్కడ ఉన్నది మమ్మాటికి తను నిత్యమూ ఆరాధించే కైలాస నాథుడే' అనుకున్నాడు. నరహరి ఇక ఒక క్షణం కూడ ఆగలేక గంతలు లాగేసుకున్నాడు. అంతే అవాక్కైపోయాడు, ఎదురుగా నడుముపై చేతులు పెట్టుకుని, ముఖంపై మందహాసం చిందిస్తూ ఇటుక బిళ్ళపై నిలుచుని ఉన్న మూర్తిని చూసి. మూర్తి పాండురంగడిది. కాని స్పర్శ మాత్రం శంకరుడిది. అనుమానం తీరక మళ్ళీ ముట్టుకుని చూశాడు. మళ్ళీ అదే అనుభవం. గంతలు కట్టుకుంటే శివుడు, తీస్తే రంగడు. నామదేవుడు పాడుతున్నాడు, 'సదాశివుణ్ణి మనసారా ఆరాధించిన వారికి పాండురంగదర్శనం కలుగును.....'

నరహరికి అంతవరకూ తన కళ్ళను ఆవరించిన పొర ఏదో తొలగి పోయినట్లైంది. అతడికి అద్వైతానుభూతి, ఆత్మసాక్షాత్కారం కలిగింది. "ఇన్నాళ్ళూ కళ్ళకు 'హరుడు వేరు, హరి వేరు అన్న భేద దృష్టి గంతలు కట్టుకుని కళ్ళున్నా అంధుడనైనాను. నేటితో అది నశించింది. ఈ రోజు పాండురంగడు ఆ భేద దృష్టి అనే పొరను తొలగించి అజ్ఞానాంధకారాన్ని హరించాడు. సత్య దృష్టిని ప్రసాదించాడు," మరుక్షణం నరహరి విఠలుడి విగ్రహం పాదాలపైన ఉన్నాడు. సాష్టాంగంగా ప్రణిపాతం చేసిన నరహరి వైపు కృపాదృక్కులతో చూశాడు పాండురంగడు. నరహరికి పాండురంగడి కళ్ళలో శివుడి దయ, క్షమ దర్శనమిచ్చాయి. నరహరి తనకు కలుగుతున్న అలౌకికమైన ఆనందాన్ని అనుభవిస్తూ కళ్ళు మూసుకుని పరవశించి పాడుతున్నాడు. 'త్రిభువనాలలో ఉన్నది ఒక్కడే. ఓ మానవా భేదం మరచి ఏకత్వం గ్రహించు' అని. నరహరి పాండురంగడి భక్తిలో చిత్తుగా నానిపోయాడు.

గుడి నుండి బయటకు రాగానే నరహరి, సెట్టిగారు నామదేవుని పాదాలపై పడ్డారు. సెట్టిగారు నామదేవుడితో.....

**సెట్టి -** నా మ్రొక్కు తీరేటట్టు చేసి నాకు మహోపకారం చేశారు. నేను మీకు ఏం ప్రత్యుపకారం చేయగలను?

**నామ -** మా యోగక్షేమాలు పాండురంగడు చూసుకుంటాడు. ముందు మిమ్మల్ని మీరు ఉద్ధరించుకునే ప్రయత్నం చేయండి.

**సెట్టి -** అంటే? నాకు అర్థం కాలేదు.

**నామ -** మీకు ఈ భోగభాగ్యాలను ఇచ్చిన దేవుడికి మీ ఈ ప్రాకృతమైన సంపద కావాలా? ఇకముందు ఇటువంటి మ్రొక్కులు మ్రొక్కకండి. వాటికి ఖర్చు పెట్టే ధనం పేదసాదలకోసం వినియోగించండి. ఇంతవరకు వడ్డీమీద వడ్డీ సంపాదించినట్లు ఇంకముందు నామధనం సంపాదించుకొని హరిదాసులు కండి.

నామదేవుడి మాటలు వింటూనే గోపాల సెట్టికి తను అష్టైశ్వర్యాలను అనుభవిస్తున్నప్పుడు కూడా కలగని ఆనందం కలిగింది. శరీరం పులకించింది. ఆనంద బాష్పాలు కారిపోతూంటే కళ్ళు తుడుచుకుంటూ గద్గద కంఠంతో 'నామదేవ్ మహరాజ్ ఈనాడు మీరు నా కళ్ళు తెరిపించి నా కర్తవ్యాన్ని బోధించారు. మీ చేతులతో నా మెడలో తులసి మాల వేసి దీక్ష ఇచ్చి నన్ను ధన్యుణ్ణి చేయండి. ఇక్కడకు తెచ్చిన ధనం అంతా బీదలకు పంచిపెట్టి క్రొత్త జీవితం ప్రారంభిస్తాను. నామదేవుడు రంగడి పాదాలవద్ద ఉన్న తులసి మాలలు తీసి ఒకటి సెట్టిగారి మెడలో వేశాడు. ఇంకొకటి నరహరి సోనార్ మెడలో వేశాడు.

సెట్టిగారు తను తెచ్చిన అపార ధనం బీదలకు అక్కడికక్కడే దానం చేశారు. అందరూ తృప్తిగా భోజనాలు చేశారు. వాళ్ళ కళ్ళలో తృప్తినీ, ఆనందాన్నీ చూసిన సెట్టిగారికి తాను ఇంతకు ముందు ఎన్నడూ రుచి చూసి ఎరుగని ఆనందం కలిగింది. పరిసా నరహరికి వీణ అందించాడు. నామదేవుడు భక్తులతో ఇంతవరకు ఈ నరహరి విఠలుడి మీద అలిగాడు. ఇప్పుడు పాండరంగడు ఆయనను సమాధాన పరిచాడు. ఇక నుంచి ఈయన మనతో కలిసి సంకీర్తన చేస్తారు అంటూ చిడతలు తీసుకొని సంకీర్తన చేస్తుంటే నరహరి వేళ్ళు వీణా తంత్రుల మీద నాట్యం చేస్తున్నాయి. ఆనాడు నరహరి పొందుతున్న ఆనందం వర్ణణాతీతం.

-సశేషం

# కృష్ణతత్వము, ప్రేమ యోగము

(గతసంచిక తరువాయి) - సుషుమ్న ప్రసాద

శ్రీరామచంద్ర ప్రభువు జాంబవంతుణ్ణి నీ కోరిక తప్పక సఫలం అవుతుంది కాని ఒక యుగ పర్యంతం నిరీక్షించమని, వరమిచ్చాడు. తత్ఫలితంగా, ద్వాపర యుగంలో శమంతక మణిని తస్కరించాడని అపవాదు వచ్చిన శ్రీకృష్ణ పరమాత్మ జాంబవంతునితో హోరాహోరి ముష్ఠియుద్ధం చేసి, జ్ఞానోదయం కలిగించి, జాంబవంతుని అభీష్టము నెరవేర్చాడు. కృష్ణ పరమాత్మ చేసిన ప్రతిచర్యలో, ప్రేమ అనుగ్రహము నిండి నిబిడీకృతమై ఉన్నాయి.

శ్రీకృష్ణ పరమాత్మ పరిపూర్ణ ప్రేమావతారం. యోగీశ్వరేశ్వర అవతారమైన శ్రీకృష్ణ పరమాత్మ జీవితం లీలామయం, భగవదీయం. నారద మహర్షి భక్తిని 'పరమ ప్రేమ రూపా' యని నిర్వచించాడు. అలాంటి భక్తి జ్యోతిని అందరి హృదయాలలో ప్రజ్వలింప చేసిన కృష్ణ తత్వము పరిపూర్ణ ప్రేమ తత్వము. శ్రీకృష్ణ పరమాత్మ భువిపై అవతరించక పూర్వమే తన దివ్య మహిమను వ్యక్తం చేయటం ప్రారంభించాడు. అమితోత్సాహంతో సోదరి దేవకీ దేవిని నూతన వధువుగా మెట్టినింటికి పంపుతున్న కంసుణ్ణి ఆకాశవాణి "నీకు తెలియటం లేదు. నీవు ఇంత ప్రేమగా అత్తవారింటికి పంపుతున్న ఈ దేవకీ దేవి అష్టమ గర్భము ద్వారా నీవు హతుడవవుతావు'' అని హెచ్చరిస్తుంది. ఆ మరుక్షణం నుండి, కంసుడు హింసకు ప్రతిరూపమై, భయవిహ్వాలుడై, అనుక్షణమూ, సర్వేసర్వత్రా, వైకుంఠ వాసుణ్ణే దర్శించాడు. ఎన్ని అకృత్యముల నాచరించినా, ఎన్ని శిశు హత్యలు చేసి, రాక్షసత్వమునకు ప్రతీకగా నిలిచినా, తన కృష్ణ ప్రేమవాహినిలో పునీతుణ్ణి చేసి, తనలో లయం చేసుకొన్నాడు శ్రీకృష్ణస్వామి.

మానవ జీవితంలో ప్రేమకు ఉన్న మహత్తరస్థానం మరి దేనికీ లేదు. ప్రేమకు, పర్యవసానమేమి? అని సందేహం రావచ్చు. ప్రేమకు ఫలితం సంపూర్ణమైన, అవధులు లేని ఆనందము. ఆనంద స్వరూపుడైన కృష్ణ భగవానుడు సర్వులకూ ఆనందాన్ని పంచిపెట్టాడు. మేఘము లక్షణం వర్షించటం. తారతమ్యంలేకుండ, భూమిని సస్యశ్యామలం చేస్తుంది. మేఘశ్యాముని దృష్టి ప్రసరించిన సర్వ జగత్తు, ఆనంద తుషారంతో విలసిల్లుతుంది.

దేవకీ వసుదేవుల నోములపంటగా, వారి పురాకృత పుణ్య విశేషముతో, వారి తనయుడుగా అవతరించిన శ్రీకృష్ణ పరమాత్మ కారాగారాన్ని వైకుంఠంగా, నిశిరాత్రిని పండు వెన్నెలగా మార్చి, భయభ్రాంతులైన మాతా పితరులకు, తన అప్రాకృత దివ్యత్వముతో శ్రీ మహావిష్ణువుగా దర్శనమిచ్చి, ప్రేమాంబుధిలో వారిని ముంచెత్తాడు. పసితనము, బాల్యము అన్నీ తనకు తాను ఆపాదించుకొని, లోకకళ్యాణార్థము, ప్రేమను పంచిపెట్టటమే ధ్యేయంగా ఎన్నుకొని, తన భవిష్యత్ప్రణాళికను నిర్ణయించుకొని, ఏమి చేయాలో జనకునకు ఆదేశించాడు. జగదాధార భూతుడైన కృష్ణ ప్రభువు తానెక్కడ పెరగాలో, ఎవరిని తన ప్రేమామృత వర్షంలో ముంచెత్తి, పునీతులను చేయాలో నిర్ణయించుకొని, నందగోకులానికి (వ్రేపల్లెవాడకు) గొనిపోయి, యశోదమ్మ పొత్తిళ్ళలో పరుండ బెట్టమని, కారాగార ద్వారాలను తెరిపించి, ద్వారపాలకులను తన మహిమచే గాఢసుషుప్తికి లోను చేసి తనయుడు తండ్రికి మార్గదర్శియై నందగోకులానికి జేర్చుమన్నాడు.

దారిలో యమునా నదిని అనుగ్రహించాడు. బాలకృష్ణుని కోమల పదపల్లవములను స్పృశించి నీలిమను సంతరించుకొని, ఉవ్వెత్తున ఆనంద తరంగాలతో నర్తించింది ఆ యమున. కృష్ణ ప్రేమ వాహినిలో యమున తన అస్తిత్వాన్ని కోల్పోయింది.

గోకులంలో అందరూ నంద యశోదల గారాలపట్టిగా, ముద్దుల తనయునిగా కృష్ణ ప్రేమను తనివిదీర జుర్రుకొన్నారు. యశోదమ్మ పొందిన మాతృత్వ మధురిమ స్త్రీ జాతికే మకుటాయమానం. నందనందనునిగా నందుని ఆనంద వాహినిలో ఓలలాడించాడు. కృష్ణ స్నేహ మధురిమతో గోపబాలకులు, మధుర ప్రేమతో గోపికలు, కృష్ణ వాత్సల్యముతో గోవులు, గోవత్సములు వేయేల - వ్రేపల్లెవాడలోని ప్రత్యణువు, చేతనాచేతనములన్ని కృష్ణప్రేమతత్వముతో పరవశించాయి. వెదురు గొట్టమైన మురళి కృష్ణాధరామృతము సోకగానే, తాను పరవశించి, ఆగానామృత ధారలను సర్వజగత్తుకు ప్రసరింపచేసి, సర్వులను ప్రేమాంబుధిలో ముంచివేసింది. మహిమాన్వితమైన మురళీధరుని పరిపూర్ణావతారము, నిష్కళంకము, నిర్మలము, నిస్స్వార్థమైన ప్రేమకు నిదర్శనము. అందుచేతనే కృష్ణ భగవానుడు మనకు నిరంతరము ప్రేమ సందేశాన్ని అందజేస్తున్నాడు.

-సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

11శ్లో ॥ **హృదయే మమ హృద్య విభ్రమాణాం**
**హృదయం హర్ష విశాలలోల నేత్రమ్,**
**తరుణం వ్రజబాల సున్దరీణాం**
**లాకళం కిఞ్చనధామ సన్నిధత్తామ్॥**

"తండ్రీ! పితృవాక్య పరిపాలనాదక్షుడు, వనవాస దీక్షా వ్రతుడు అయిన దశరథ నందనుడు మాతావులకు విచ్చేసినపుడు స్వామిని దర్శించి అమందానంద కందళిత హృదయారవిందులమైనాము. పుంసాం మోహనరూపుడైన ఆ పురుషోత్తముని చూస్తూనే మోహాబ్ధిలో మునిగిపోయాము. కామము నణచిన వారమైనా మాలో వింతవింత కోర్కెలు తీవలు సాగాయి. సర్వజ్ఞుడైన స్వామికి మా మనస్సులు విప్పి చూపాము. "పూజ్యులారా! మీ మనోరథాలను తీర్చటానికిది సమయంకాదు నేను ఏక పత్నీ వ్రతుడను కనుక నేడు కాదు రేపు'' అంటూ చిరునవ్వుతో మమ్మల్ని అనుగ్రహిస్తూ మాకు అభయమిచ్చాడు. ఇక మా ఆనందం వర్ణనాతీతమైంది. త్రికాల వేదివి అయిన నీకు జరిగింది విన్నవించడానికి వచ్చాము. మా చిరకాల తపోఫలితమై లభించిన వరాన్ని ఆనందంగా అనుభవించేట్లు ఆశీర్వదించవయ్యా'' అన్నారు సుకృతాత్ములైన మహర్షులు, మునిపుంగవులు వినయంగా నమస్కరిస్తూ. చతుర్ముఖుడు వారి మాటలు వింటూ మందహాసం చేసి 'మనోభీష్ట సిద్ధిరస్తు' అని దీవించాడు. ఆపైన వారి రూపాలను చూశాడు. పెరిగిన గడ్డాలు, మీసాలు, శిరస్సున జటలు గమనించి తల పంకించాడు. బ్రహ్మదేవుని రెప్పపాటులోనే రాఘవుడు అన్న రేపు నేడై.. అద్దాల చెక్కిళ్ళు, అరుణాధరాలు అళికులాన్ని తలదన్నే నీలికేశపాశాలు కలిగి వారంతా గోపకాంతలై గోకులవాసినులైనారు.

నిరాకార నిర్గుణ నిరంజనుడైన బ్రహ్మము సాకారుడై సర్వాంగసుందరుడై అవతరించిన వేళ బాలగోపాలుని లీలావిహారాలలో వ్రజధామమంతా కలకల్లాడి పోతున్నది. ఆదిబ్రహ్మ వాని అంగాంగ సౌందర్యానికి అబ్బురపడి మురిసిపోతూ, వాని ఎడల తనకు కూడా కలిగిన మోహావేశాన్ని, గోపీరమణుల మనోమందిరాలలో పరమమైన ప్రేమామృత భాండాలుగా నింపి ప్రతిష్ఠించాడు. ఇక చెప్పేదేముంది? గోపికల నిరంతర నిది ధ్యాసనలో వ్రజమోహనుడే నిండి ఉంటాడు. రాత్రీ పగలూ అనిలేదు. వానినే ఆలోచిస్తూ తలపోస్తుంటారు. స్వామిని విడిచి ఉన్నపుడు స్వామి సన్నిధిలో తమకి కలిగిన ఆనందానుభూతులను చర్వితచర్వణంగా చెప్పుకుంటూ ఉంటారు. వీలైన వేళల్లో అంతా ఒకచోట కూడుతుంటారు. కబుర్లాడుకుంటారు. కలిసి నవ్వుకుంటారు. వాటన్నిటిలో ఉండేది కృష్ణుడే.

ఒక గోపిక నీళ్ళకోసం యమునా నదికి వెళ్ళి ఆ జలాలలో విరిసిన కమలాలను చూస్తూ అట్టె నిలిచిపోతుంది. మరో గోపిక ఆమె భుజం తడుతూ "నువ్వొక్కదానివే అలాగ ఆనందాబ్దిలో మునిగిపోతే ఎలా! నీతోబాటు నీచుట్టు ఉన్న మమ్మల్నందర్నీ కూడా మునగనియ్యవే" అంటుంది. ఆమె రవ్వంత తేరుకుని 'ఎవరే' అంటుంది. "నేనమ్మా మాధ..." మాధా అని వినబడగానే ఇక ఆ తరువాతది పూర్తిగా వినకుండానే "మాధవా! మన్నించవయ్యా! ఈ అరవిందదళాలవంటి అందాల కన్నులున్న ఓ స్వామీ! మా కళ్ళని చరితార్థం చేస్తూ మా ఎదటికి వచ్చి నిలబడవయ్యా" అంటుంది. 'ఆ కళ్ళల్లో మధురమైన అనురాగ సుధను కురిపించి తన కోసమే వేచి ఉండి విరహంలో మరిగిపోతున్న మన మనస్సులకు తాపశాంతి చేస్తాడు కదమ్మ" అంటుంది మరో వనిత. మన అంతరంగాలలోని అవగుణాలనే అసురగుణాలను వాడిగా వేడిగా ఉండే తన చూపులను సూటిగా మన హృదయాలలో నాటి వాటిని భస్మం చేస్తాడు కదా!" అంటూ దేవదేవుని జీవరక్షణ లక్షణాన్ని పొగుడుతుంది, ఇంకో గోపిక. అంతలో అప్పుడే అక్కడికి వచ్చిన రాధమ్మ వారందరి మనోభావాలను గ్రహిస్తూ "మునుపు నారాయణుడు వామనుడై అవతరించినపుడు ఎర్ర తామరరేకులంటి వాని చరణారవిందాలను చూస్తూ ఏమి అడిగినా ఇచ్చేసేందుకు సిద్ధపడ్డాడు కదా బలిచక్రవర్తి. కుసుమ కోమలమైన ఆ చరణారవిందాన్ని తన తలమీద మోపినప్పుడు ఆ మహారాజు మహదానంద వశుడై ఆ క్షణాలు శాశ్వతం కావాలని కోరుకున్నాడని తెలిసిన ముక్తిదాత వాని ముంగిట్లోనే నిలిచిపోయాడని నందగోపుని లోగిలిలో గర్గాచార్యులవారు చెప్తుంటే విన్నాము కదా! అటువంటి దివ్యపాదాల నాశ్రయించి ఉన్న మనందరికీ వానితో గడిపే కాలమంతా శాశ్వతమై తిరిగిరాని పరమపదాన్నందిస్తుందమ్మా!" గద్గద స్వరమూ పులకిత శరీరమూ ఆర్ద్ర నయనాలతో రాధమ్మ అంటుంటే అంతా వింటున్న అక్కడున్నవారందరికీ అదే స్థితి కలిగి ఒళ్ళు తెలిసింది కాదు. ఆ సమయాన చేరువన ఉన్న మావి చెట్టుమీద కోయిల ఒకటి చిగురాకులు తిని కమ్మగా గొంతు విప్పి స్వామి వేణువుననుకరిస్తూ పలికే రాగాన్ని వింటూ అంతా ఉలిక్కి పడ్డారు. ఎక్కడో బాగా పెరిగిన చెట్టు కొమ్మలలో దాగున్న సంపెంగ సౌరభాన్ని పిల్లతెమ్మెర ఒకటి మోసుకొచ్చి వారందరి ముక్కుపుటాలకు సోకి మురిపించగా స్వామి అందాల నాసిక యీ సంపెంగ వలెనే ఉంటుంది అనుకుని ఆ ధ్యాసలో మైమరచి ఉన్న వ్రజవధూ సుందరుల నిరీక్షణను సఫలం చేస్తూ... తరుణ ప్రాయంలో ఉండి, చక్కదనానికి నెలవై పరమానందరసం తొణికిసలాడే కన్నులతో గోపభామినుల పెన్నిధి అయిన గోపాల చక్రవర్తి వారి ఎదుట సాక్షాత్కరించాడు. ఆ దివ్య గోపాల తేజము నా మనస్సులో ఉద్భవించుగాక!*

# మౌనధ్యాన సప్తాహశిబిరం

-రమణ ప్రసాద్

(మార్చి ది 17 నుండి ది 23 వరకు శ్రీ కాళీవనాశ్రమంలో శ్రీ మాతాజీ వారి పరమానుగ్రహంతో జరిగిన మౌన ధ్యాన సప్తాహంలో ఎందరో భక్తులు పాల్గొన్నారు. వారిలో అన్ని వయస్సులవారు ఉన్నారు. శ్రీ మాతాజీవారు ధ్యాన ప్రక్రియ పై చేసిన ప్రసంగాలను సంక్షిప్తంగా ప్రచురిస్తున్నాము.)

- ఎడిటర్

ధ్యానం ఎలా చేయాలి? అనే విషయంపైన శ్రీగురుదేవులు తమ బోధామృతాన్ని మనకు అందించారు. ఈ రోజు అందరి భాగ్యంగా శ్రీ గురుదేవులు పూజ్య శ్రీ దండి నిర్మాలానందస్వామి వారిని పంపించారు. అటువంటి ధ్యానము, స్మరణ, విచారణ కలిగి వివేకము, వైరాగ్యము ధరించి వచ్చినవారు మహాత్ములు. నువ్వు ఏ దేవుని విశ్వసించావో ధ్యానంలో నువ్వు ఆశ్రయించిన ఆ పాదాన్ని గుర్తిస్తుంది నీ మనస్సు. ధ్యానంలో మనస్సు ఎక్కడ లయిస్తే 'మనోలయం, ముక్తిలయం యథార్థః' - అక్కడ ధ్యానం ఆగిపోయి అలౌకికమైన ఆనందలహరిలో ఓలలాడతారు. సహజంగా భగవంతుడు అటువంటి స్థితిని ఎలా ఉంటుందో చూపించటానికే మనకు 'నిద్ర'ను ఇచ్చాడు. మానసికంగా 'లైటు తియ్యలేదు తలుపు తియ్యలేదు' అని ఆలోచిస్తూ భగవత్ప్రసాదంగా నిద్రలోకి జారుకుంటున్నాడు. తిరిగి లేస్తున్నాడు. ఎన్ని పనులు చేస్తున్నా నిద్రపోయి లేచాక ఒక విశ్రాంత స్థితిని పొంది 'నేను హాయిగా నిదురించాను' అంటాడు. ఆ విశ్రాంతి స్థితి ఎలా వచ్చింది? నిద్రలో మనస్సు అణిగి ఉంది. మళ్ళీ కల వస్తే కలలో ప్రపంచం సృష్టింపబడుతోంది. సమస్యలు ఉన్నవాడికి దుఃఖ భరితమైన కలలు వస్తాయి. ఎలా భగవంతుడు నిద్ర ఇచ్చాడో, అలా జాగ్రదస్థితిలోనే సుషుప్తిస్థితిని ప్రసాదించాడు. దానినే 'ధ్యానం' అన్నారు. ధి - యానం - అంటే మనస్సు చేసే ప్రయాణం. ఆ మూర్తి (ధ్యేయమూర్తి) ఎక్కడ ఉంటే అక్కడ ఆనందం. అది ఇంట్లో ఉంటే బాగుంటుందా? హృదయంలో ఉండాలి. ఇందులో ఉన్న దానికి ఆహారాదులు, పూజలు, అక్కర లేదు. స్వామివారు చెప్పారుకదా. అహంకార మమకారాలు రెండూ తీసివేసుకొని అప్పుడు మనం పొందే స్థితి ఈ పాటలో ఇచ్చారు.

**హృదయమె శివమందిరమని మొదలు తెలియవే మనసా**
**మాయ అను కవాటము ఆ మందిరమును మూసినదె**
**శివుడే సద్గురు రూపము స్వీకరించి వచ్చెనే**

**తన కృపాప్రసారమ్ముమ్మన ద్వారమ్ముమ్ములు తెరచునే**
**తన బోధల వెలుగున శివ దర్శనమ్ముమ్ము చేయించునే ॥**

ఎన్నిసార్లు వింటున్నాం. పుస్తకాలలో ఉంది. మన మస్తకాలలో ఉంది. కాని అసలు మనం గుర్తించామా? గుర్తిస్తే మనస్సులో కలకలం ఉంటుందా? హృదయం శివమందిరమని గుర్తిస్తే మానవుడు దుఃఖానికి లోనవుతాడా? మనస్సు మలిన విషయాలతో నిండి, హృదయంలో ప్రకాశించే ఆ భగవంతుణ్ణి గుర్తించ లేక పోతున్నాము. అవగాహన లేక ఆచరణలోకి వచ్చే సరికి అలమటించి పోతున్నాం. తెలుసుకోవటానికి ఆవేదన కావాలి. ఆకలి ఉండాలి. పిల్లవాడికి ఆకలేస్తే తల్లి గుర్తుకొస్తుంది.

అసలు ఈ దేహం ఎందుకు వచ్చింది? మూడుసార్లు తినటానికి, ఆరుసార్లు వెళ్ళటానికా? దానికంటే వేరే ఏదీ లేదా ఈ జీవితానికి? ఈ జన్మ పోతే తిరిగి ఈ మహాత్ముల సన్నిధి లభిస్తుందని చెప్పగలమా? చెప్పలేము. అందుకని పద్మంక్రింద కప్పలాగా ఉండవద్దు. పద్మంలోని తేనె గ్రహించే తేనెటీగలాగా ఉండాలి.

మాయ అనే కవాటము మూసి ఉంది అని తెలిసింది. దానిని తెరవాలి. ఆ మందిరంలో ఎవరు ఉన్నారు? 'శివుడే సద్గురు రూపము స్వీకరించి వచ్చెనే' - వారికి అవసరం ఏముంది? ఈ మాయను తొలగించటం కోసం భగవద్గీతలో

**ద్వావిమౌ పురుషౌలోకే । క్షరశ్చాక్షర ఏవచ ।**
**క్షర స్సర్వాణి భూతాని । కూటస్థో Z క్షర ఉచ్యతే ॥**(15- 14)

ఈ జగత్తులో 'క్షరుడు' - నశించేవాడు; అక్షరుడు వినాశరహితుడు అని పురుషులు రెండు విధములుగ ఉందురు. సకల ప్రాణుల శరీరములు నశ్వరములు. జీవాత్మ నాశరహితుడు. లోపల ప్రకాశించేవాడు అక్షర స్వరూపుడు. మనం క్షరమైనదానిని ఆశ్రయించి, మనం నాశనమయ్యేవాళ్ళం అని సరిపెట్టుకుంటున్నాం. క్షరమైన ప్రపంచాన్ని ఆశ్రయిస్తే సరిపోదు. చైతన్యాన్ని ఆశ్రయించాలి. 'కరెంట్' లేకపోతే 'మైకు' పనిచేయదు. అది ఉత్త ఇనపముక్క.

విషయాదులలో ఉన్న మనస్సుకు మహాత్ముల సాంగత్యంలో వైరాగ్యం వస్తుంది. ధ్యానంలో కూర్చోకపోయినా వస్తుంది. 'ధ్యానం పేరుతో నువ్వు చేసినది ధర్మం. చేయకపోవటం సోమరితనం' అంటారు శ్రీగురుదేవులు.

'గురుకృపా ప్రసారమ్ముమ్మన ద్వారమ్ముమ్మను తెరచునే' ఎక్కడ ఉంటే ఏం? కానిదానిని చెత్తగ చూడాలి. అయినదానిని హాయిగా అనుభవించాలి. తత్పరతతో ఉంటే గురుకృపా ప్రసారం జరుగుతుంది. 'లూజ్ కనెక్షన్' మనస్సుకు ఉంటే జీవితం వృథా చేసికొన్నవాళ్ళమవుతాం.

'తన బోధల వెలుగున శివ దర్శనమ్ము చేయించునే'

**ద్రష్ట దర్శన దృశ్యాదిభావ శూన్యైక వస్తుని**
**నిర్విచారే నిరాకారే నిర్విశేషే భిదా కుతః ॥**

ద్రష్ట ,దర్శనము, దృశ్యము అను భేదములేక నిర్వికారము, నిర్విశేషము ఏకము అయిన బ్రహ్మ వస్తువునందు భేదమెట్లు ఉండగలదు? ఉండదు.

ధ్యాత, ధ్యానము, ధ్యేయము అని మూడు లేవు ;అనుభవానికి వచ్చే సరికి అటువంటి స్థితిని పొందాలని ఆవేదన చెందుతూ పాడే పాట ఇది. ఏడిస్తే భగవంతుడి దగ్గరే ఏడ్వాలి. మనం తరించాలనే వేదన భగవంతుని దగ్గరే పడాలి. అర్జునుడు ఎక్కడ ఏడ్చాడు? మన ప్రతినిధిగా అర్జునుడు నిలబడ్డాడు. ఎవరి దగ్గర ఏడిస్తే ఇక ఏడ్వవలసిన అవసరం లేదో, అక్కడ ఏడ్చాడు. అంత ఓపికగానూ విన్నాడు కృష్ణయ్య. దాని సమాధానం మనకందరికీ తెలిసినదే! సమయం చూసి తగిన ఏర్పాటును చేసికోవాలి. కాబట్టి సద్గురు సన్నిధానంలో చేసే ధ్యాన ప్రక్రియలో తురీయమైన స్థితిని మనకు శ్రీ గురుదేవులు ప్రసాదించెదరుగాక! *

## శ్రీమాతాజీవారి సత్సంగ మహోత్సవములు

జూన్ 2నుండి 7వ తేదీ వరకు పెద నింద్రకొలను గ్రామం శ్రీ కాళీవనాశ్రమం బ్రాంచ్‌లో శ్రీ బాబూజీ భక్తసమాజ్ శ్రీ మాతాజీవారి సత్సంగ సమావేశములు ఏర్పాటు చేసినారు. భక్తులందరూ ఈ అవకాశమును సద్వినియోగ పరచుకోగలరు. ఉదయం-సుప్రభాతం, ధ్యానం, ప్రార్థన,నగర సంకీర్తన, సంకీర్తన శ్రీమాతాజీ వారి దివ్యబోధ, తీర్థప్రసాదాలు మరియు సాయంత్రం - సంకీర్తన, శ్రీ మాతాజీ బోధామృతం. విశేష కార్యక్రమాలు - 4వ తేదీ, శుక్రవారం - సామూహిక కుంకుమపూజలు, 7వ తేదీ, సోమవారం హనుమజ్జయంతి, శ్రీ ఆంజనేయ స్వామి పూజ, శ్రీ సద్గురుపూజ.

శ్రీ నరసింహారావుగారు సెల్ నెం. - 08818 -222652, సెల్ :9440124322
శ్రీ సుబ్బరాజుగారు సెల్ నెం :9440377399
శ్రీ హనుమంతు సెల్ నెం :9966333124

# మాతాజీ బోధామృతం

(గతసంచిక తరువాయి) - శివ ప్రసాద్

( శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయంలో ది. 28-09-09 శ్రీ మాతాజీవారి అనుగ్రహ భాషణకు సంగ్రహ రూపం)

మనస్సును ఏకాగ్రం చేసి, మన జీవితాన్ని గురుదేవుని చరణాలకు అర్పణ చేసుకోవాలి. అది ఆశ్రమంలో ఉంటే తేలిక. ప్రపంచదృష్టితో ఆశ్రమంలో ఉంటే లాభంలేదు. ప్రపంచంలో ఉన్నా మనము ఆశ్రమదృష్టితో ఉండాలి.

భోజనానికి ఎలా ముందు ఉంటారో, అలా సత్సంగానికి కూడ ఫస్ట్, ఫస్ట్ ఉండాలి. పరమాత్మ తత్త్వాన్ని అందిస్తున్నప్పుడు, ఎదురుగా కూర్చొని, ఆ తత్త్వాన్ని, ఆ భావాన్ని పొందుతూ మనం కూడ దానిని accept చెయ్యాలి. పాఠం బాగా ఎప్పుడు అర్థం అవుతుంది? ఏక్లాస్‌కు ఆ గెటప్ ఉండాలి. సత్యంతో తాదాత్మ్యం పొందాలి.

సత్యం అనేది సర్వవ్యాపకంగా ఉన్నది. దానిని మనం accept చెయ్యగలగాలి. అది ఏదీ కానిది అయినా అన్నీ అయి ఉన్నది. ఈ రోజు దశమి. అంటే అమ్మ అసురులనందరినీ సంహరించిన రోజు. ఇంతకు ముందే అమ్మ అసురులను ఎందరినో సంహరించింది. అసురులలో అందరికి వెన్నెముకవంటివాడు అహంకారం అనే రాక్షసుడు. ఎప్పుడు సంసార దృష్టి ఉంటుందో, అప్పుడు కామము, క్రోధము, జెలసీ, స్వార్థ దృష్టి, అన్నీ ఉంటై.

**అహంత్యక్త్వా అహమస్మ్యహం**

దేహభావం అనే అహంకారాన్ని వర్జించు. దానిలో ఉన్న అసలైన దానిని అనుభవించు. మందువాడుతున్నా, పథ్యం సరిగ్గా లేకపోతే రోగం తగ్గుతుందా? మందువేసుకున్నాంగదా అని పథ్యం చెయ్యకపోతే రోగం తగ్గదు. గురుదేవుని సన్నిధిలో ఉండి కూడ, నా దేహం అనుకుంటే సత్యాన్ని మాటవరసకేగాని, నిజంగా అనుభవించ లేదన్న మాట. సత్యాన్ని అనుభవించాలి అంటే దానికి అధికారి అయి ఉండాలి. దానికి గురుదేవులు శరణాగతి అనే దానిని ప్రసాదించారు.

ఏ ఒక్కటీ కాకపోయినా అన్నీ తానే అయిన ఆయనను అనుభవించాలి. మహాత్ములు సంకీర్తనల ద్వారా, వారి బోధలద్వారా ఎన్నో ఒలక పోశారు,

కాని మనం వాటిని ఏరుకోలేక పోతున్నాము. శరణాగతి అర్జునుడు చేశాడు. అర్జునుడు చేసింది మనం కూడ చేస్తే చాలు. అతడికి ఏం తక్కువ? దేవలోకందాకా వెళ్ళాడు. అక్కడ కూడ పరీక్ష పెట్టారు. నందనవనంలో ఎకామొడేషన్ (accommodation) ఇచ్చారు. ఊర్వశిని కూడ సేవలు చేయటానికి పంపారు. Hotel వాడు స్టేటస్ (status) చూసి తలుపులు తీస్తాడు. ఒక status కలిగినప్పుడు, వచ్చి, ముందు ఆగితే, వాడు తలుపు తీస్తాడు. అక్కడ నుంచి మన జేబు ఖాళీ కావటం మొదలౌతుంది. తన స్థితిని మరచి ఎవడు ఉంటాడో వాడి ముఖం తప్పినవాడి ముఖంలా ఉంటుంది.

ఈ జన్మ రహస్యం గుర్తించాలి అని మనుష్య జన్మ వస్తే, మనం దానిని గుర్తించటంలేదు. నీటిలో బుడగలు రావటంలేదా పోవటంలేదా. అలా అని విషయాలను అనుభవిస్తే, ఏ జన్మ వస్తేనేమి? కాని మనుష్య జన్మ కలిగినందుకు, దీనిని అమృతమయంగా చేసుకొని, ఆ అమృతత్వాన్ని అనుభవించాలి. అలా అమృతత్వాన్ని అనుభవించాలి అంటే, దానికి గురుదేవుల అనుగ్రహం ఉండాలి.

తల్లిదండ్రులు ఆస్తిపాస్తులు ఇవ్వవచ్చు, అవీ వాళ్ళ దగ్గర ఉంటేనే ఇస్తారు. కాని ఏదో ఒకరోజు అవి తిరిగి ఖర్చైపోతై. గురుదేవులు తరిగిపోని ధనాన్ని ఇస్తున్నారు. ఎంత ఖర్చుపెట్టినా తరగని ధనం అది.

**నామస్మరణ ధనమే నీ ధనము,**
**నిజమిది నమ్ముము జీవా! జీవా! ॥నామ॥**
**ప్రేమతో ధనమెంతో కూడ బెట్టినను**
**కాసైనను నీ వెంటరాదురా**
**విత్తముచే నీకు ఒకనాడైనా**
**చిత్తశాంతి దొరకదురా జీవా ॥నామ॥**
**మాతాపితా సుతా కళత్రాదులు**
**ఝూటారా, ఈ జగమే ఝూటా**
**వీతరాగివై శ్రీహరి నామము**
**స్మరియించి తరియించర జీవా ॥నామ॥**

(అన్న గురుదేవుల ముఖస్థుగా వెలువడిన పై సంకీర్తన పాడి, తరువాత శ్రీ గురు శ్శరణంమమ, సద్గురు శ్శరణంమమ అనే నామాన్ని శ్రీమాతాజీ తాము మధురంగా చేస్తూ అందరి చేత చేయించారు.) -సశేషం

# మాతాజీ సత్సంగ్ డైరీ

(గతసంచిక తరువాయి) -రమణ ప్రసాద్

యు ఏవం వేద, సవిష్ణు రేవ భవతి, సవిష్ణురేవ భవతి. ఎవరు అలా అటువంటి నారాయణుణ్ణి ఆశ్రయిస్తారో, అతడు విష్ణువే అవుతాడు. అటువంటి శ్రీరామచంద్రుని ఆశ్రయించిన ఆంజనేయస్వామి ఆ రాముని కంటె ఏమైనా భిన్నంగా ఉన్నాడా? అటువంటి ఏకలవ్యులం మనం ఎందుకు కాలేకపోతున్నాము? దేహదృష్టి బాగా బలిసింది. ఈ మేనును నేను అనుకుంటున్నాము. మనం రామ నామాన్ని ధ్యానం చెయ్యటం లేదు. నిన్న అనుకున్నాము కదా రామ నామాన్ని గురించి చెప్పుకుందామని.

**దేహవాసన వదలిన ఘనదివ్య దృష్టియె రామనామము**
**ఆత్మతపములు సలుపువారికి ఆత్మయజ్ఞము రామనామము**
**ఆత్మ జీవాత్మలును తానై ఆడుచున్నది రామనామము**
**రామనామము రామనామము రమ్యమైనది రామనామము**

ఆత్మ, జీవాత్మ తానే అయి ఆడుతున్నది. మనం ఒక మూర్తిని చూడగానే "నా ప్రభూ!" అనుకుంటున్నాము. కాని ఎంత సేపు ఉంటున్నాము. నీ వాసనలు నీ మనస్సును వెంటనే వెనక్కు తీసికొస్తున్నాయి. దేహ వాసన ఆ ఏకత్వాన్ని గుర్తింప నీయకుండా మనస్సును ఎక్కడికో తీసికొని వెళ్తుంది. శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో

**క్లేశోధికతరస్తేషాం అవ్యక్తాసక్త చేతసాం**
**అవ్యక్తాహి గతిర్దుఖం దేవద్భి రవాప్యతే ॥** (భగవద్గీత - 12.6)

అంటాడు. అవ్యక్తం అంటే వ్యక్తంకానిది. అవ్యక్తోపాసన చెయ్యాలని దేహాభిమానం ఉన్నవారు అనుకుంటే, అది వారికి చాల కష్టం. దేహ భావన పెంచుకుంటూ అవ్యక్తమైన తత్వాన్ని తెలుసుకోవటం కష్టం. సీతారాముల తత్వాన్ని, అంత కన్న రాధాకృష్ణుల తత్వాన్నీ తెలిసికోవటం కష్టం. శివపార్వతుల అర్ధనారీశ్వర తత్వాన్ని తెలిసికోవటం ఇంకా చాల కష్టం. ఇక్కడే కాదు, పైనకూడ అంతే. ఏదో చిన్న గలాటా వస్తుంది. ఇక అంతవరకు ఎంతో అన్యోన్యంగా ఉన్న దంపతుల మధ్య ఎంత గోల? అలా జరిగే కదా, భృగు మహర్షి తన స్థానమైన భర్త వక్ష స్థలాన్ని తన్నినా నారాయణుడు ఊరుకున్నాడు అనే కదా లక్ష్మమ్మ తల్లి నారాయణుణ్ణి, వైకుంఠాన్ని వదలి భూలోకం వచ్చింది, ఆయన మళ్ళీ వెంకటేశ్వర స్వామిగా రావలసి వచ్చింది.

కాకపోతే మానవులు తమను తాము గుర్తించలేకపోతున్నారు. పోనీ భగవంతుణ్ణైనా గుర్తిస్తారా అంటే, ఇందులో చైతన్యం ఉన్నంత వరకేగా ఏది చేసినా? ఈ లోపల వాడి ప్రాణాలు పోతై. వాణ్ణి రామ నామ్ సత్య హై అంటూ మోసుకెళ్తారు. కొంతమందిని కూర్చో బెట్టి తీసికెళ్తారు. రామ్ నామ్ సత్యహై అన్నప్పుడల్లా ఔను ఔను అన్నట్లు వాడి తలపైకి క్రిందకు ఊగుతుంటుంది. మనం ఆ రామనామం మీద దృష్టి పెట్టాలి.

కేవలం దేహవాసన పోగొట్టు కోవటం ఒక్కటే చాలదు. కొంతమందికి ఉన్నట్లుండి ఆవేశం వస్తుంది. ఆ క్షణికావేశంలో వెంటనే దేవుడి దగ్గరకు వెళ్ళి ఏ చెయ్యి కాల్చుకోవటము వంటివో చేస్తారు. దేవుడు ఎప్పుడూ, దేహ రూపంలో ఉన్న తనను అలా హింసించమని చెప్పలేదు. కాల్చుకో వలసింది మనస్సును. దానికి ఒక్కటే మార్గం చెప్పారు.

**యస్య సర్వే సమారంభాః కామసంకల్ప వర్జితాః**
**జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం తమాహుః పండితం బుధాః**

(-భగవద్గీత - 19 శ్లో ॥)

శ్రీగురుదేవులు జ్ఞానాగ్ని దాక అక్కర్లేదు, ధ్యానాగ్ని దగ్ధ కర్మాణం. నీ ధ్యానమనే అగ్ని చాలు నీ కర్మలన్నీ దగ్ధం చెయ్యటానికి అని చెప్పారు. ఈ మధ్య సాధనలో నా అనుభవంలో తెలిసిందేమంటే నామాని దగ్ధ కర్మాణి అని. నామాన్ని మించిన ఉపాయం లేదు. నామాన్ని ఎలా చేయాలి?

**మనసొక చోట తనువొకచోట ఉన్న మానవుని జన్మమె వృథరా**
**మనసార హరిభజన చేయరా నోరార నారాయణా అనరా**

నోరార నారాయణా అనరా. నిజంగా నోరారనామం అంటే మనస్సు పక్కలకు పోతుందా? ఇందాక నారాయణ నామం అనుకున్నాము కదా! వేరే ఏమైనా రాగూడనిది మనస్సులోకి వచ్చిందా? ఒక వేళ జగత్తు వస్తే ఇంకా ఏవో కోరికలు, ఆశలు ఉన్నై అన్నమాట. ప్రాణం ఉండగానే నామం చేయాలి. ప్రాణం చెప్పి పోదు. సడెన్ (sudden) గా పోతుంది. ఎంతమంది అలా సడెన్‌గా పోవటం లేదు.

**ఈ క్షణమే నీదనుకో, మరుక్షణమే లేదనుకో**
**ఆవాంతరాలను సవాలు చేసి అవకాశాలుగ మార్చుకో**
**లే, లే, లే, మేలుకో, తెలివి తెచ్చుకో, గమ్యంవరకు దూసుకుపో**
**ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరా న్నిబోధత**
**మేలుకో, తెలివి తెచ్చుకో, గమ్యంవరకూ దూసుకుపో**

**మగతలో పడిన మానసమా! నిదురించు కొదమ సింహమా!**
**ప్రాలు మాలుటకు కాలంకాదిది జాలు హుషారుగ విదుల్చుకో ।లే॥**
Arise, awake, stop not till the goal is reached.
**ప్రాలుమాలుటకు కాలం కాదిది జాలు హుషారుగ విదుల్చుకో**
**కష్టాలే కలగనీ, నష్టాలే మిగలనీ ఇష్టంగా ఎదురొడ్డి దాటుకొని**
**నిష్ఠను వీడక సాగిపో ॥లే॥**
**కొడిగడుతున్నది ఈ దీపం। పడిపోయేదే ఈ దేహం**
**దీపం కొండెక్కేలోగానే నీ పని చక్కగ ముగించుకో ॥**

మనందరం మెలకువగా ఉన్నాము అనుకుంటున్నాము. కాని జాగ్రదవస్థ అనే దీర్ఘ స్వప్నావస్థలో ఉండి నిజ జాగ్రత్తను గుర్తించలేక పోతున్నాము. ఇది స్వప్నం అని తెలిసికోవటం లేదు. ఈ స్వప్నం ఇలా ఎంత కాలం సాగుతుంది? ఈ స్వప్నాన్ని ఎవరు అనుభవిస్తున్నారు? ఈ ఆలోచనలన్నీ తెగేలోగా ప్రాణం పోతుంది. దీపం కొండెక్కేలోగా వచ్చిన పని పూర్తి చేసుకోవాలి.

లైటు లేదా వెలుతురు ఉన్నంత వరకు మంచి పనులు చేస్తారు. వాటిలో భక్తి ఉందా? నామం ఉందా. చీకటిలో నీవు చేసే పనులతో, నీ పాప పుణ్యాలతో సంబంధం లేకుండా లైటు సాక్షి స్వరూపంగా ఉన్నది. దాని మీద దృష్టి పెట్టు. ఈ క్షణమే నీది. మరుక్షణము లేదనుకో. ఒకవేళ ఉన్నా అది నీకు ఉండక పోవచ్చు. అవాంతరాలు వస్తే వాటిని అవకాశాలుగా మార్చుకో. రామా! నాకు పరీక్షలు పెడుతున్నావా? అని రామదాసు ఆ రాముణ్ణే అడిగాడు. కష్టాలు వస్తే ఎవర్ని అడగాలి? భగవంతుడి అర్చామూర్తి వద్ద, నీ ఇష్టదైవం అర్చామూర్తి ముందు కూర్చొని చెప్పుకో. దేవుణ్ణి నమ్మి చెడ్డవారు లేరు. కృత్రిమ నమ్మకంతో, కృత్రిమ విశ్వాసంతో మహాత్ములను, భగవంతుణ్ణి పరీక్ష చేయవద్దు. చేతులు కాల్చుకోవద్దు. మన మనస్సును మనం మంచి మార్గంలోకి మార్చుకోవాలి. దానిని శాసించకండి. ఇవాళ ఏమైనా సరే సాధన చెయ్యాలి అనుకుంటారు. కాని మనస్సు పక్కలకు పోకుండా ఉంటుందా? మనుషులు రావటం పోవటం తెలుస్తుంటుంది. శబ్దాలు వినిపిస్తుంటై. వాసనలు తెలుస్తుంటై. ఇంకా కదలికలు తెలుస్తున్నై. అందుకని నిన్ను నీవు అలా మోసం చేసికోకు. నీ ధర్మాన్ని నీవు నిర్వర్తించు. అందులో భగవంతుణ్ణి దర్శించు.

-సశేషం

# శ్రీ బాబూజీ దివ్యవాణి

భగవాన్ శ్రీకృష్ణుడ్ని భక్తులందరి లోకి నందవ్రజ గోపికలు అత్యుత్తమ శ్రేణికి చెందినవారుగా పరిగణించ బడుతూ ఉంటారు. ఆదివ్య కిశోరుని ముగ్ధనోహర మూర్తి వారి నెంతగా ఆకర్షించినదంటే, తనుమన ప్రాణ హృదంతరాత్మలను వారు అతనికే అంకితం చేసుకున్నారు. అతడు లేని ప్రపంచం వారికి వట్టి శూన్యం. అతని ప్రత్యక్ష సన్నిధిముందర, దేవతల స్వర్గధామాన్నీ, అంతిమ ముక్తిపదాన్ని సైతం వారు తృణ ప్రాయంగానే చూచారు.

అట్టి గోపికలందరిలోకి అగ్రస్థానం రాధాదేవిది. అప్పుడే పుట్టిన శిశువుగా ఆ ప్రభువును వసుదేవుడు నందుని ఇంటికి గొని వచ్చి యశోద ప్రక్కన పరుండబెట్టి నప్పుడు, ఆ విషయం గుర్తించినది ఒక్క రాధయేనని వర్ణించబడియున్నది. విష్ణు మాయ ప్రభావం వల్ల ఆ సమయంలో తక్కినవారంతా - నంద యశోదలు సైతం - గాఢ నిద్రలో ఉండిపోయారు. నంద గృహమున ప్రవేశపెట్టబడిన ఆ బాలునిలో శ్రీ మహా విష్ణువును ఆమె దర్శించింది.

ఆమెలోని మహనీయ సంస్కార విశేషం, అదే సమయంలో ఆ చిన్ని శిశువు దివ్యపాదారవిందద్వంద్వం ఆమె హృదయంలో హత్తుకొని పోయింది. అటు పిమ్మట ఆమె సర్వత్ర - తన హృదయంలో, బుద్ధిలో, శరీరంలో తన యింటిలో, ప్రతి వ్యక్తిలో, ప్రతి వస్తువులో, తన జాగ్రద్దశలో, స్వప్నంలోనేగాక సుషుప్తిలో - అంతటా అతనినే ఆమె దర్శిస్తూ వచ్చింది.

అయితే, ఇంతటి మహనీయానందానుభవ స్థితి నందుకొన్నప్పటికీ, ఆమెకు పూర్ణ సంతృప్తి లేకపోయింది. కృష్ణ సాహచర్యం కలిగిన వారందరిలోకీ ఆయనతో అత్యంత సన్నిహితత్వం కలిగినది ఆమెయే. తన దినచర్యయందత్యధిక భాగం అతడు ఆమెతోనే గడుపుతూ ఉండేవాడు. కాని, భౌతికంగా - అతడు తన సన్నిధిలో లేని ఆ అత్యల్ప సమయములు కూడా ఆమెకు చాల దుర్భరములుగా ఉండేవి. ఆహార పానీయములు విషతుల్యములుగా తోచేవి. వెన్నెల మండు వేసవి యెండగాను, పూలపాన్పు ముళ్ళ శయనముగానూ స్ఫురించేది.

తాను వరించిన పురుషుడు మరొక స్త్రీతో ఎక్కువ సన్నిహితంగా మెలగుతున్నా డనే భావం స్త్రీ హృదయాన్ని వెన్నాడి వేధించినట్లుగా మరేదీ వేధించదు. ఆ పురుషుడు అనేక మందితో కలిసి తిరుగుతూ ఉంటాడనేది

లోక విదితమైనప్పుడు ఈ వేదన మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుత సందర్భంలో రాధకు కూడా అటువంటి వేదనయే కలిగింది.

నిజానికి కృష్ణుడు ఏ యితర వ్యక్తియెడకంటె రాధయెడనే విశేషానురక్తుడు. కాని ప్రతి దినమూ, ఒక్క క్షణమైన విరామం లేకుండా ఇరువది నాలుగు గంటలూ కృష్ణ సాన్నిధ్యమనుభవించే మహాభాగ్యం తనకుగాక వేరొకరికి కలుగుతూ ఉన్నదనేది ఆమెకనుగొన్నప్పుడు ఎక్కడలేని ఆవేదనకు ఆమె గురి అయింది. ఇంతకూ అంతటి భాగ్యానికి నోచుకున్నది ఎవరోకాదు, అతని వేణువే - నిరంతరము అది చేతులలోనో, మొలయందో ఉండక తప్పదు. నిద్రలో సైతం దాన్ని ఎప్పుడు అతడు వదిలి ఉండడు. అతని అధరామృతపాన మాధుర్యమును దానంతగా అనుభవించేవారు వేరొకరు లేరు.

ఇంతకూ ఏమిటా వేణువులోని విశేషం? పెక్కు చిల్లులతో కూడిన వెదురు గొట్టమే కదా. లోపల ఖాళీ తప్ప మరేమీ లేదు. మరి ఎందుకు దానికా గొప్పతనం? ప్రభుని నిత్య సాన్నిధ్యమునుభవించే భాగ్యం ఏ గుణవిశేషాలవలన అబ్బింది? ఈ విధమైన భావాలన్నీ చెలరేగి రాధను అస్థిర చిత్తురాలను చేసినాయి.

"ప్రభుని విధానాలు కడు చిత్రంగా, దురవగాహంగా ఉంటాయి. నందవ్రజంలో ఇంతమంది సుందరాంగులుండగా, తన నిత్య సాహచర్యానికి ఈ వట్టి ఖాళీ వెదురు గొట్టాన్ని ఎన్నుకోడం చిత్రం కాదా? ఆయన దివ్యుడే కావచ్చుగాని, వట్టి కుర్రతనపు చేష్టలు" - అని అనుకున్నదామె.

భక్తుని హృదయమూ,బుద్ధి సదా స్ఫటిక స్వచ్ఛములై ఉండడం అవసరం. ఎవరియెడగాని అసూయ, ద్వేషం, అసహనం మొదలైన అవలక్షణా లేవి అందు పొడసూపరాదు. ఏలనంటె, అది సర్వాంతర్యామియైన ప్రభువును ద్వేషించడమే అవుతుంది. అట్టి భావాలు భక్తుని ఆధ్యాత్మిక పురోగతిని అడ్డగిస్తాయి. కరుణామయుడైన భగవానుడు భక్తుని సదా కనిపెట్టియే ఉంటాడు. వానిలో ఇట్టి అవలక్షణాలు ఏమాత్రం తలఎత్తినా, వెంటనే దానిని సరిదిద్దడానికి అనురాగంతో పూనుకొని సక్రమమార్గంలో త్వరితగతిని భక్తుడు తనను చేరుకొని తనలో లీనం కావడానికి సకల సహకారమూ అందిస్తాడు.

నంబూరు చెంతగల కాళీ గార్డెన్సులో సద్గురు శ్రీ కాళీ వరప్రసాద బాబు తన శిష్యులకు, రాధలో పొడసూపిన ఈ మలిన భావాలను పోగొట్టడానికి ప్రభువు ఏ రీతిగా అనుగ్రహించినదీ కడు రమణీయంగా అభివర్ణిస్తూ ఉద్బోధ చేశారు.

-సశేషం

# సమర్ధ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

ఒక సాధువు ఏదో కొంత సాధన చేసి, నీటిని నోటితో పీల్చి, క్రిందనుండి వదిలేవాడు, అలాగే నోటితో పొగ పీల్చి నీళ్ళలో దిగి, క్రిందనుండి వదిలేవాడు. అది బుడగలుగా నీటి బయటికి వస్తుంటే,"స్టీమర్, స్టీమర్" అనేవాడు. నీటిపై తేలేవాడు. పక్షివలె ఎగిరే వాడు. శ్రీ బాబు దీనిని గురించి చెబుతూ "ఈవిద్యల వలన జ్ఞానం ఎన్నటికీ కలగదు. అవి ఉదరపోషణకు పనికి వచ్చే గారడి విద్యలే. గారడీ విద్య నేర్చినవాడు చూపించేవన్నీ నశించేవే. కాని, నశించని వస్తువును అందించే విద్య ఒకటి ఉంది. అదే బ్రహ్మ విద్య. అది నేర్చినవాడే నిజమైన సాధువు" అని తెలిపారు.



పట్టుదలతో సాధన చేసి, సిద్ధి పొందినవారే మహాత్ములు. వారెన్నడూ తమ సాధన ముగిసిందని, తాము సిద్ధిని పొందామని చెప్పుకోరు. "నేను సిద్ధిని పొందాను" అని ఎవరైనా అన్నారంటే, వారు వైకుంఠపాళిలోని పెద్దపాము నోటిలో పడినట్లే. శ్రీ బాబు సత్సంగాలలో మాట్లాడుతూ "నేను భగవంతుణ్ణి కాదు, మహాత్ముణ్ణి కాదు, భగవద్భక్తుల దాసానుదాసుణ్ణి మాత్రమే. నిజమైన భక్తులుగాని,మహాత్ములుగాని కనిపిస్తే, వారి పాద ధూళి నా శిరస్సున ధరించి, ధన్యుడనైనట్లు భావిస్తాను" అనేవారు. అది నిజమైన మహాత్ముని భావన.

'దాసోZహం'అనే వినమ్ర భక్తి భావనతో సాధన చేసిన మానవుడు తప్పక 'సోZహం' అనే ఆత్మ జ్ఞానాన్ని అనుభవంలో పొందగలడు. కనుకనే భక్తికి పరాకాష్ఠ జ్ఞానమనీ, జ్ఞానానికి పరాకాష్ఠ మోక్షస్థితి అని శ్రీ బాబు అనేవారు. మహాత్ములంటే **"మహతో మహీయాన్"** - మహత్తునకే మహత్తు అయినవారు అటువంటివారు మాత్రమే **"అణోరణీయాన్"** - అణువుకంటె చిన్నదైన పరమాణువులోకూడా, ఇంకా సూక్ష్మాతిసూక్ష్మమై ఒదిగిపోగలరు.

**తొలి పరిచయాలు**

భగవానుడు లోకరక్షణార్థమై అవతారం ధరించి వచ్చే సందర్భాలలో, ఆ

అవతార కార్యక్రమానికి ఉపకరించే నిమిత్తమై ఆయన పరివారమూ, తదితర దేవతలూ, మహర్షులూ యథోచిత రూపాలను ధరించి, భూలోకంలో జన్మిస్తారనేది పురాణ ప్రసిద్ధమైన సత్యము. ఈ కలియుగంలోనూ, శ్రీశంకర భగవత్పాదాచార్య స్వాములవారు, శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీచైతన్య మహా ప్రభువు, మొదలైన మహాత్ముల అవతార సమయాలలో కూడా, జరిగిన యథార్థమిది. అలాగే శ్రీబాబూజీ మహరాజ్ వారి అవతరణ సందర్భంలో పూజ్యయోగిని శ్రీచంద్ర కాళీప్రసాద మాతాజీ, శ్రీ కందర్ప పరశురామయ్యగారు, శ్రీ చిరంజీవి రాజుగారు, డా॥లంక శేషగిరిరావుగారు, శ్రీ లలితానంద సరస్వతీ స్వామి మరెందరో మహనీయులు కారణ జన్ములనటంలో సందేహం లేదు. శ్రీ బాబుతో వీరందరి సాహచర్యాన్ని గురించి రాబోయే అధ్యాయాలలో వివరంగా తెలుసుకుందాము.

శ్రీబాబు పుట్టు పూర్వోత్తరాలను గురించి ఇదమిద్ధమని ఎవరికీ తెలియదు. అయినా మనకు తెలిసినంత వరకు వారు మానవాళి మధ్యకు వచ్చి, ప్రథమంగా పిఠాపురం, ఉప్పాడ, గుంటూరు, తుని గ్రామాలలో వెల్లడైనారనీ 1936 నాటికే వారిని దర్శించిన వారున్నారనీ తెలుస్తున్నది. ఇవికాక కోరుకొల్లు, యనమదుర్రు, దిరుసుమర్రు, గుండుగొలను గ్రామాలలో కూడా, 1940 తరువాతి సంవత్సరాలలో అభివ్యక్తమైనారు. ఉప్పాడ, కోరుకొల్లు, యనమదుర్రు, దిరుసుమర్రు గ్రామాలలో శ్రీబాబు సంచరించిన వివరాలు పూర్తిగాను, గుంటూరు, తుని, గుండుగొలను గ్రామాలతో వారి ప్రథమ పరిచయ విషయాలు ప్రస్తావన మాత్రంగాను ఈ అధ్యాయంలోనే పేర్కొనబడ్డాయి.

### ఉప్పాడ

కాకినాడకు దగ్గరలోనే ఉన్న ఉప్పాడ గ్రామంలో శ్రీదంగేటి సూర్యనారాయణ గారు, వారి ధర్మపత్ని శ్రీమతి సత్యవతమ్మగారు నివసిస్తూ ఉండేవారు. సత్యవతమ్మగారి బావగారైన నూకరాజు గారి భార్య గర్భిణితో చనిపోగా, వారు రెండవ వివాహం చేసుకున్నారు. గతించిన భార్య గ్రహరూపంలో రెండవ భార్యను ఆవేశించి చాలా తిప్పలు పెట్టింది. ఎన్ని వైద్యాలకు, భూత వైద్యులకు కూడ లొంగలేదు. వారి పరిచయస్థులు కొందరు పిఠాపురంలో తమకు తెలిసిన ఒక మహిమాన్వితుడైన “ బాల సాధువు” ఉన్నాడని, ఇటువంటి భూత, పిశాచాల బాధలను నివారించటంలో ఆయన చాలా ఘటికుడని, చెప్పి ఆ బాల సాధువును ఉప్పాడ తీసుకుని వచ్చారు. తీసుకురావటం నూకరాజుగారింట్లో పనిమీదే అయినా, ఆ సాధువు ఉండటానికి

వసతి శ్రీమతి సత్యవతమ్మగారింటిలో ఏర్పాటు చేశారు. ఆ బాల సాధువు గారే శ్రీబాబు. ఆవిధంగా సత్యవతమ్మ దంపతులకు శ్రీబాబు ప్రథమ దర్శన భాగ్యము, సేవాభాగ్యము లభించినవి. ఈ క్రింది వివరాలను సత్యవతమ్మగారే స్వయంగా తెలియజేశారు.

సత్యవతమ్మగారికి చిన్నతనంలోనే వివాహం జరిగింది. శ్రీబాబు వారింటికి వచ్చేసరికి ఆమె వయస్సు 15 సంవత్సరములు మాత్రమే. అయినా, ఆమెకు అప్పటికే సంతానం కలగటం, నష్టపోవటం కూడా జరిగింది.

సాధువు 12, 13 ఏళ్ళకు మించని బాలుని వలెనే కనబడుతున్నాడు. ఆయన కాలికి గుల్లగాఉన్న ఒక అందె, కాలికీ చేతికీ తావీదులూ (తాయెత్తులు),మెళ్ళో ఆంజనేయస్వామి బిళ్ళ, ముక్కుకు కాడ, చెవులకు పోగులు ఉన్నాయి. తల చిక్కుచిక్కులుగా, కేశ సంస్కారము లేకుండా చింపిరిగా ఉంది. ఏవో మాసిపోయిన వస్త్రాలు ధరించి ఉన్నాడు. వాలకమంతా ఏ కోయజాతి వాళ్ల వద్దనో ఉండి వచ్చినట్లు కనబడుతున్నది. కాని తేజోవంతమైన ముఖవర్చస్సు, దివ్యత్వంతో మెరిసే కన్నులు, పులి చర్మంతో చేసిన దేవతార్చన పెట్టె, మందహాసంతో నిండిన ప్రసన్నత, ఆయనను ఒక దివ్యబాలునిగా స్ఫురింపజేస్తున్నవి.

15 సంవత్సరాల వయస్సుగల సత్యవతమ్మగారికి, 12 సంవత్సరాల బాల సాధువును చూడగానే మాతృ భావన కలిగింది. అది ఎన్ని జన్మల అనుబంధమో, ఎంత పరిపక్వమైన సంస్కారమో అయి ఉండాలి. సూర్య నారాయణగారు కూడా శ్రీబాబు యెడల పితృ వాత్సల్యం కలిగి ఉండేవారు. శ్రీబాబును చూడగానే సత్యవతమ్మగారికి ఎందుచేతనో, ఆపుకోలేనిదుఃఖం కలిగింది. "అయ్యో! నా బాబు, నా బుజ్జి కృష్ణయ్య, ఇలా ఉన్నాడేమిటి? ఆ బట్టలేమిటి? ఆ జుట్టేమిటి? కోయవానివలె ఆ అవతారమేమిటి?" అని బాధ పడ్డారు. "పేరేమిటి నాయనా?" అని అడిగారు. " బాబు అని పిలవండమ్మా! చాలు" అన్నాడు బాల సాధువు.

సత్యవతమ్మగారు క్షురకుణ్ణి పిలిపించి, శ్రీ బాబు జుట్టు చక్కగా కత్తెర వేయించారు, తలంటు పోశారు. చిక్కును విడదీసి చక్కగా తలదువ్వారు. కట్టుకోవడానికి మంచి బట్టలిచ్చారు. శ్రీబాబు దేవతార్చనకు పూజ గది శుభ్రం చేశారు. పూలదండలు మాత్రం శ్రీబాబు స్వయంగా, తామే గుచ్చుకొనేవారు. (తరువాత చాలాకాలం వరకు శ్రీబాబు తమ పూజకు దండలు తామే గుచ్చుకొనే వారు)

-సశేషం




(గతసంచిక తరువాయి) -రమణ ప్రసాద్

ఉగ్రసేనుడు జలాశయంవైపు గబ గబా అడుగులు వేశాడు. ఆ క్రీడా సరస్సు ప్రక్కనే లతలమాటున పవనరేఖ అర్ధనగ్నంగా మూర్ఛిల్లి ఉన్నది!.........

కొంతసేపటికి ఆమె మెల్లగా కళ్ళు విచ్చి చుట్టూ చూసింది. అక్కడ ఉన్నవారిని చూడగానే తను ఏ స్థితిలో ఉన్నదో స్ఫురించి సంభ్రమంగా లేచి నుంచుంది. అస్త వ్యస్తంగాఉన్న వస్త్రాన్ని హడావిడిగా చుట్టుకుంటూ ఒక వృక్షం చాటుకి నిర్గమించింది... అందరూ ఉగ్రసేనుడు ఏం చేస్తాడా అని అతనివైపు చూశారు! అతడు విభ్రాంతుడై ఉన్నాడు. అతడికి మాటలు రావటంలేదు. జడునిమాదిరిగా అయ్యాడు. జనులందరూ తప్పుకొన్నారు. పవనరేఖ, ఉగ్రసేనుడు ఇద్దరే అక్కడ మిగిలారు.

కొంచెం సేపు ఆగి ఉగ్రసేనుడు మెల్లగా తను ఉన్నచోటునుండి కదలి వృక్షంచాటున వడలి వాడిపోయి ముకుళించిన పుష్పం వలె ఉన్న పవనరేఖ వద్దకు వచ్చాడు.... ఆమె కన్నెత్తి చూడలేకపోతోంది........ ఏమీ చెప్పలేకపోతోంది.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ఉగ్రసేనుడు అన్నాడు, "పవనరేఖా!.... గణరాజ్యంలోని ~~ఈ~~తరంవారు ~~ఈ~~ సంఘటనను చూసీచూడనట్లుగా ఉండవచ్చు. కాని భావితరంవారు తమ గణాధ్యక్షుడైన ఉగ్రసేనుని పత్ని ~~ఈ~~ విధంగా శీలం కోల్పోవటం ఎలా సహిస్తారు? నారీ పవిత్రత, పాతివ్రత్యాలే తమ సంస్కృతి పరంపరగ ఉన్న వ్రజభూమిలో ఇది గణరాజ్యాల పతనానికి ప్రథమ సోపానమవుతుంది."

"నాథా! నేను నిర్దోషిని, నేను నిష్పాపిని!" పవనరేఖ పతి చరణాలపై వాలిపోయింది... ఆమె ఆక్రోసిస్తూ అన్న మాటలు, ఆమె నిస్సహాయ రోదనము తప్ప అక్కడ ఇంకేమీ వినిపించటం లేదు. అంతా నిశ్శబ్దం'

ఆర్య ఉగ్రసేనుడు మృదువుగా పవనరేఖ తల నిమురుతున్నాడు. కాని అతని చూపులు పవనరేఖను దాటి భావికాలంలో ఏదో వెతుకుతున్నాయి.

పవనరేఖ గర్భం ధరించింది. కాని రాజభవనంలో ఎక్కడా ఆనంద చిహ్నాలు లేవు. ఆమె నన్ను ప్రసవించినప్పుడే ఉగ్రసేనుని ఆవాసంలో దీపాలు వెలిగించలేదు. పుత్రుడు జన్మించినందుకు ఉత్సవాలు జరుపలేదు. మిఠాయిలు పంచలేదు. పంచమని ఎవ్వరూ అడగనుకూడా లేదు. మధురవాసులు ఉత్సవాలు జరుపుకోలేదు సరికదా, పవనరేఖకు పుత్రుడు పుట్టాడు అని వినగానే ఎందరికో కనుబొమలు ముడిపడ్డాయి.... పాతివ్రత్య సంరక్షణ భారం పూర్తిగా స్త్రీలదే అని నమ్మిన వనితలు మొహం తిప్పుకున్నారు. మూతులు ముడిచారు. మెటికలు విరిచారు. ఇక ఉగ్రసేనుడు... ఆయన ముఖం వివర్ణమైంది. వ్యథాకులుడైన ఉగ్రసేనుడు ఆరోజు గణపరిషత్ కార్యాలను త్వర త్వరగా ముగించుకొని తన గృహానికి వచ్చాడు. ఎవరూ ఏమీ మాట్లాడటం లేదు.

ఉగ్రసేనుడు పవనరేఖ ఉన్న గదిలోకి వెళ్తూ కనిపించాడు. ఆమె మంచం ప్రక్కన నిలబడి మొదటిసారిగ పుత్రుడి ముఖం చూశాడు.... ఒక స్వర్ణ ముద్ర శిశువు చేతిలో మెల్లగా పెట్టాడు...... పవనరేఖ చూస్తోంది.... పతి బాలకుడిని చేతిలో తీసుకొని అక్కున చేర్చుకోలేదు. ఆమె చూడనట్లుగా కళ్ళు అటువైపునించి తిప్పుకుంది.... కాని అలా ఎంతసేపు ఉండగలదు... తిరిగి భర్త వైపు చూసే సరికి ఉగ్రసేనుడు ఉపవస్త్రంతో కళ్ళు తుడుచుకుంటున్నాడు.

నేను తండ్రి ఉగ్రసేనుని వేలు పట్టుకొని భూమిమీద అడుగు పెట్టినప్పుడు మధురవాసులు గమనించీ గమనించనట్లుగా ఉన్నారు. వ్రజ భూమి గణతంత్ర భారాన్ని అలవోకగా వహించే గణాధ్యక్షుని వేలు శిశువునైన నా భారాన్ని మోయలేక పోతోంది... వెంటనే నన్ను పవనరేఖకి అప్పగించాడు...

నాకు వయస్సుతోపాటు అవగాహన పెరిగింది. మధురా నగరంలో అందరూ నేను గణాధ్యక్షుని పుత్రుణ్ణి అవటం వల్ల నన్ను సన్మానిస్తారు కాని అందులో ఆత్మీయత ప్రేమ మచ్చుకైనా ఉండదు. ఉగ్రసేనుడు కూడా విశేషంగా నాతో మాట్లాడడు. అన్నిటికన్నా ఆయన ఈ మౌనం నన్ను సర్వాధికంగా బాధిస్తోంది.

నేను యువకుణ్ణయ్యాను. మల్ల యుద్ధంలో గొప్ప ప్రావీణ్యాన్ని సంపాదించాను.... గద నా చేతిలో పువ్వులాగా అలవోకగా తిరుగుతుంది. పర్వతాలను పిండి చేసే నా సామర్థ్యం, తేజస్సు, ప్రతాపం అన్ని హద్దులను అతిక్రమించాయి. నా ఈ ప్రతాపాన్ని, శౌర్యాన్ని చూసి మధురావాసులలో

కొందరు దీర్ఘంగా నిట్టూరుస్తూ. "ఏమైనాగాని ఉగ్రసేనుని పుత్రుడైన ఈ ప్రతాపవంతుడు యాదవుడు కాడు" అని గుస గుస లాడితే, కొందరైతే "ఈ కంసుడు యాదవుడై ఉంటే వ్రజభూమి ఎంతో శోభాయమానంగా ఉండేదికదా!" అని అనుకొంటూ ఉండేవారు.

నేను జన్మించాక పవనరేఖ తన ఆవాసం నుండి బయటకు రావటం పూర్తిగా మానేసింది. తల్లి ఇలా ఐచ్ఛికంగా ఏకాంతవాసం చేయటం నాకు సమాధానందొరకని శేషప్రశ్నగా మిగిలిపోయింది. ఉగ్రసేనుడు కూడా గణతంత్రంలో జరిగే ఉత్సవాలలోగాని జనసమూహంతో ఉన్నప్పుడుగాని పవనరేఖతో సభామండపంలో కూర్చోవటంలేదు.

మధురానగరం అంతా ఉత్సవాలతో ఆనందోత్సాహాలతో కళకళ లాడుతుంటే ఆ ఉత్సవాలలో పవనరేఖ ఎందుకు పాల్గొనటంలేదు? ఎందుకని? ఈ పురజనులు, యాదవ పరివారం నాతో ఆత్మీయతగా ఎందుకు వ్యవహరించరు? ఎందుకు తండ్రి ఉగ్రసేనుడు పవనరేఖను దూరంగా ఉంచుతున్నాడు? పవనరేఖ ఇలా నలుగురిలోకి రాకుండా వెలివేయబడిన దానివలె ఏకాంతవాసం చేయటానికి కారణం ఏమిటి? ఇలా ఎన్నో ప్రశ్నలు నాలో తలఎత్తేవి. ఈ భావాలు కలిగినప్పుడల్లా నా పళ్ళు గట్టిగా బిగుసుకొనేవి. భుజాల కండలు ఉబ్బేవి... పిడికిళ్ళు గట్టిగా బిగిసేవి.

నా తల్లి తండ్రికి దూరంగా ఉండటం అస్వాభావికంగా తోచేది. అదే నా అస్వాభావిక మనస్థితికి కూడా దారి తీసింది... నేను ఒక దృఢ నిశ్చయానికి వచ్చాను. నా తల్లి ఇలా ఏకాంతవాసం చేయటానికి కారకులైన వారిని వెతికి పట్టుకోవాలి. అతడు ఎవరో తెలియగానే ఈ కంసుడు అతనిఅంతు చూస్తాడు. ఈ నగరవాసులు, యాదవ కులస్థులు నన్ను తక్కువగా చూస్తున్నారు. వారందరూ ఒక రోజు నా కాళ్ళపై పడాలి. అలా పడేటట్లు నేను తప్పకచేస్తాను.

ఈ సంకల్పాన్ని పూర్తి చేయటానికి తాను నిమిత్తమాత్రుడు అన్నట్టుగా దేవర్షి నారదుడు వచ్చాడు. బ్రహ్మాండం అంతా చుట్టుతూ నారదుడు మధురకు వచ్చి వ్రజవాసులు ఇచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించాడు.

"కళ్యాణమస్తు!"ఆశీర్వదించి "మాత పవనరేఖ కుశలమేకదా వత్సా!" అని నారదుడు కంసుణ్ణి అడిగాడు.

-సశేషం

**అతి తక్కువ ఫీజులతో ఉత్తమ విద్యాబోధనతో నడుపబడుతున్న సంస్థ**

**అడ్మిషన్లు జరుగుచున్నవి**

# శ్రీశ్రీశ్రీ హనుమత్‌కాళీ వర ప్రసాద బాబు ఆవాస గురుకులం

(శ్రీకాళీగార్డెన్స్, నంబూరు ఆర్.ఎస్. గుంటూరు జిల్లా, ఆం.ప్ర)

**(ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థ)**

ఆగండి! ఆలోచించండి!!

విద్య అంటే విజ్ఞానము. అది అమ్మబడేది కాదు. కొనబడేది కాదు. అది అనుభవంతో కూడిన అధ్యాపకులు రూపొందించిన కార్యక్రమాల ద్వారా ఆర్జించేది. నర్సరీ నుండి ఎల్.కెజితో సహా టెన్త్ క్లాస్ వరకు ఇంగ్లీషు మీడియంలో శిక్షణ.

ప్రత్యేకతలు :

- ప్రశాంత వాతావరణము, ఆధ్యాత్మిక శిక్షణ
- యోగాసనాలు
- క్రమశిక్షణ, సత్ ప్రవర్తన
- అగ్రగామి టీచర్లచే బోధన
- రెసిడెన్షియల్ ట్యూటర్ల పర్యవేక్షణలో చదివించటం
- బాలబాలికలకు ప్రత్యేక హాస్టలు వసతి
- వీక్లీ టెస్ట్‌లు, డైలీ అస్సైన్‌మెంట్లు
- కంప్యూటర్ ఎడ్యుకేషన్
- డే స్కాలర్స్‌కి బస్సు సౌకర్యము
- సంస్కృత, హిందీ పరీక్షలకు శిక్షణ
- వైద్యసదుపాయం
- సెమి రెసిడెన్షియల్ సౌకర్యము కల్పించబడుతుంది.

గమనిక :

1. ఈ పాఠశాల యందు కనీసము 3సంవత్సరములు చదివి, గణనీయమైన మార్కులను సాధించిన పేదవిద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యము కలదు.

2. స్కూలు 4-6-2010న తెరువబడును. వివరములకు కరెస్పాండెంట్‌గారిని స్వయంగాగాని, ఫోన్‌ద్వారాగాని సంప్రదించవచ్చు. లేదా వారికి వివరముల కొరకు వ్రాయండి.

**డా॥కె.వి. ఆర్ రమణ** M.Sc., Ph.D.

కరెస్పాండెంట్ ఫోన్ నెం. (0863)2594211(ఆ)

2293824(ఇ) మొబైల్:9393220400

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,